www.prajavinikidi.com
RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక
తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
8978701613,7013016545

సంపుటి - 3 సంచిక -360 మంగళవారం 7 ఏప్రిల్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


# హామీలు నెరవేరుస్తున్నాం

## రూ.225 కోట్లతో బాసర సరస్వతీ ఆలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన

- మేం పాలకులం కాదు..ప్రజా సేవకులం
- ఆదిలాబాద్ ప్రజల గుండెల నిండా అభిమానం
- ప్రతి రెండు నెలలకోసారి వస్తాం.. నిధులు ఇస్తాం
- బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధి
- తుమ్మిడిహెట్టి, ప్రాణహిత నిర్మాణానికి సర్వే

: పిప్రి గ్రామ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి





**ఆదిలాబాద్ ఏప్రిల్ 6 (ప్రజావినికిడి):** రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి పాలకులుగా కాకుండా ప్రజా సేవకులుగా పని చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన తీసుకురావడానికి చేసిన పోరాటంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సోమవారం సీఎం పర్యటనలో భాగంగా నిర్మల్ జిల్లా బాసరలో రూ.225 కోట్లతో జ్ఞాన సరస్వతి ఆలయం పునర్నిర్మాణ పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. మనుమడికి ఆలయంలో అక్షరభ్యాసం చేయించారు. అనంతరం రూ.1,250 కోట్లతో బోథ్ నియోజకవర్గంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత బజార్‌హత్నూర్ మండలం పిప్రి గ్రామంలో 'ప్రజాపాలన-ప్రగతిబాట' బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు**మిగతా 2లో...**

# ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి

## గెజిట్ విడుదల చేసిన కేంద్రం

- ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి సంపూర్ణ చట్టబద్ధత
- కేంద్ర న్యాయశాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ
- 2024 జూన్ 2 నుంచి అమల్లోకి వచ్చినట్లు వెల్లడి




2లో.

# ఒక్క రాత్రిలో ఇరాన్‌ను తుడిచిపెట్టగలం

- ఇరాన్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోవచ్చు: ట్రంప్ సంచలన వ్యాఖ్యలు
- ఇరాన్‌లో చిక్కుకున్న రెండో అమెరికా పైలట్‌ను రక్షించిన సైన్యం
- 155 విమానాలతో చారిత్రాత్మక రెస్క్యూ ఆపరేషన్ నిర్వహణ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు అత్యంత తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. ఒక్క రాత్రిలోనే ఇరాన్ దేశాన్ని పూర్తిగా తుడిచిపెట్టగలమని, ఆ రాత్రి రేపే కావచ్చని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌లో కూలిపోయిన అమెరికా ఎఫ్-15 విమాన సిబ్బందిలో రెండో వ్యక్తిని **మిగతా 2లో...**



# ఒకేసారి 9 మంది పోలీసులకు ఉరిశిక్ష...

- మధురై కోర్టు సంచలన తీర్పు
- సాతంకుళం కస్టడీ మరణాల కేసులో సంచలన తీర్పు



# హామీలను అమలు చేసిన ఘనత మాది

## పీపుల్స్ మార్చ్‌లో ఇచ్చిన హామీలకు కార్యరూపం

## మాకు వ్యక్తిగత ఎజెండా లేదన్న భట్టి విక్రమార్క


**ఆదిలాబాద్, ఏప్రిల్ 6 (ప్రజావినికిడి):** అధికారంలోకి వచ్చేందుకు నేతలు ఎన్నో హామీలు ఇస్తుంటారని, కొందరు అధికారంలోకి రాగానే వాటిని మర్చిపోతారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. తాము అలాంటివాళ్లం కాదన్నారు. తాను చేపట్టిన పీపుల్స్ మార్చ్‌కు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా పిప్పిరిలో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. పిప్పిరిలో మొదలుపెట్టి ఖమ్మం వరకు పాదయాత్ర చేసినట్లు గుర్తు చేసుకున్నారు.

పీపుల్స్ మార్చ్‌లో ఇచ్చిన హామీల అమలుపై జీవోలు జారీ చేశాం. ఇవాళే రూ.1,238 కోట్లతో చేపట్టే పనులకు శంకుస్థాపన చేశాం. ఒకే విడతలో రుణమాఫీ చేసి రూ.22,500 కోట్లను రైతుల ఖాతాల్లో వేశాం. ప్రతి నియోజకవర్గంలో పేదల **మిగతా 2లో...**



# జాబిల్లి చెంతకు ఆర్టెమిస్2

- భూమి నుంచి రికార్డు దూరంలో
- 1970లో అపోలో 13 కంటే 2,500 కి.మీ అదనం
- 10న పసిఫిక్ మహాసముద్రంలో
- ల్యాండింగ్ అయ్యే అవకాశం : శాస్త్రవేత్తలు



# ఉమ్మడి పౌరస్మృతి, జమిలి ఎన్నికలు అమలు దిశగా అడుగులు

## పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేళ ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ ఏప్రిల్ 6 (ప్రజావినికిడి):** భారతీయ జనతా పార్టీ కీలక ఎజెండాలైన ఉమ్మడి పౌర స్మృతి, ఒకే దేశం, ఒకే ఎన్నికలను అమలు చేసే దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దీనిపై చర్చోపచర్చలు జరుగుతున్నాయని, సానుకూల పురోగతి కూడా కనిపిస్తోందని పేర్కొన్నారు. భాజపా 47 వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన వర్చువల్‌గా పాల్గొని మాట్లాడారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ల అంశాన్ని 1994లోనే భారతీయ జనతా పార్టీ లేవనెత్తిందని ప్రధాని మోదీ గుర్తు చేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం మహిళలకు**మిగతా 2లో...**



# డ్రైవింగ్ లైసెన్స్‌కు కొత్త టెస్ట్!



# ఆదిలబాద్‌కు గోదావరి నీరు పారిస్తా

- తుమ్మడిహట్టి నిర్మించి జిల్లాను సస్యశ్యామలం చేస్తాం
- జిల్లా అభివృద్ధిని విస్మరించిన గత పాలకులు
- పిప్రిలో రూ.695 కోట్ల అభివృద్ధి పనులకు భూమిపూజ
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి



2లో.

# ఆదిలబాద్‌కు గోదావరి నీరు పారిస్తా

**తుమ్మడిహట్టి నిర్మించి జిల్లాను సస్యశ్యామలం చేస్తాం**
**బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధి**
**ఆదిలాబాద్ విమానాశ్రయానికి త్వరలోనే శంకుస్థాపన**
**త్వరలోనే జిల్లాకు యూనివర్సిటీ మంజూరు**
**పర్యాటకంగా, పారిశ్రామికంగా జిల్లా అభివృద్ధి**
**జిల్లా అభివృద్ధిని విస్మరించిన గత పాలకులు**
**పిప్రిలో రూ.695 కోట్ల అభివృద్ధి పనులకు భూమిపూజ**
**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి**



**ఆదిలాబాద్ ఏప్రిల్ 6 (ప్రజావినికిడి):** గత ప్రభుత్వం తుమ్మిడిహట్టి ప్రాజెక్టును పక్కనపెట్టి ఆదిలాబాద్ జిల్లాకు అన్యాయం చేసిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తుమ్మిడిహట్టి ప్రాజెక్టును నిర్మించి ఆదిలాబాద్ జిల్లాలో గోదావరి నీళ్లు పారిస్తుందని చెప్పారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి త్వరలోనే శంకుస్థాపన చేస్తామని, ఈ జిల్లాను పర్యాటకంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. త్వరలోనే జిల్లాకు యూనివర్సిటీ మంజూరు చేసి శంకుస్థాపన చేస్తామన్నారు. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరంలో ఉన్న ఆలయాలన్నింటినీ అభివృద్ధి చేస్తామన్నారు. ఆదిలాబాద్ జిల్లాపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని రేవంత్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు పిప్రి నుంచే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ చేపట్టి ప్రజా సమస్యలు తెలుసుకున్నారని ఆయన చెప్పారు. ఆదిలాబాద్ ప్రజలు అమాయకులే కాదు.. నిరంకుశత్వంపై పోరాడిన వీరులంటూ జిల్లా వాసులపై ప్రశంసల వర్షం కురిపించారు. ఆదిలాబాద్ జిల్లా పిప్రిలో ముఖ్యమంత్రి, పలువురు మంత్రులు పర్యటించారు. ఈ సందర్భంగా రూ.695 కోట్ల అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రగతి పాలన బహిరంగ సభకు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..2029 వరకు జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల హద్దులు మార్చవద్దని కేంద్రం చెప్పింది. కేంద్రం ఆంక్షలు ఎత్తివేయగానే హద్దులు మారుస్తాం. కాళేశర్వం కూలేశ్వరం అయ్యింది. గత పాలకులు తుమ్మిడిహట్టిని పక్కనపెట్టి ఆదిలాబాద్‌కు అన్యాయం చేశారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్ట్‌ను నిర్మించి ఆదిలాబాద్‌కు నీళ్లిస్తాం' అని తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి ఆదిలాబాద్ దూరంగా ఉంది. కేసులు, అక్రమ నిర్భందాలకు వ్యతిరేకంగా పోరాడి అధికారంలోకి వచ్చాం. విపక్ష ఎమ్మెల్యేలను శత్రువులు గా కాంగ్రెస్ ప్రభుత్వం చూడదు. బీజేపీ, బీఆర్ఎస్ మాకు రాజకీయ ప్రత్యర్థులు మాత్రమే.. శత్రువులు కాదు. అభివృద్ధి పనుల కార్యక్రమానికి విపక్ష ఎమ్మెల్యేలను కూడా పిలిచాం. గతంలో ముఖ్యమంత్రి వస్తుంటే విపక్ష నేతలను అరెస్టులు, గృహనిర్బంధాలు చేసేవారు. ఇక్కడ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు లేకపోయినా నిధులు ఇస్తున్నాం. మేం పార్టీలు చూడకుండా అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నాం అని అన్నారు. సంక్షేమ పథకాల అమలులో రాజకీయాలు చూడటం లేదు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాం. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వలేదు. కానీ మేం పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నాం. ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇప్పటికే రూ.5,400 కోట్లు పేదల ఖాతాల్లో వేశాం. సన్నబియ్యంతో పేదల కడుపు నింపాలనే ఆలోచన గత పాలకులకు వచ్చిందా అని ప్రశ్నించారు. ఆదిలాబాద్ జిల్లా ప్రజలు అమాయకులే కాదు. నిరంకుశత్వం మీద పోరాడిన వీరులు. కుమురంభీం వంటి ఆదివాసీ వీరులు నిజాం నిరంకుశత్వంపై పోరాడారు. ఆదిలాబాద్ జిల్లాకు ఆధునిక విద్య, వైద్యం వంటి సదుపాయాలు ఇంకా దక్కలేదు. ఎన్నో ఒత్తిళ్లు, బెదిరింపులు తట్టుకొని కాంగ్రెస్ కార్యకర్తలు పోరాడారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలను శత్రువులుగా చూసే ప్రభుత్వం కాదు ఇది. రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం ఇస్తున్న రాష్ట్రం.. దేశంలో మరొకటి లేదు. యువత మత్తుబాట వదిలి.. మైదానాల బాట పట్టాలని ప్రయత్నం చేస్తున్నాం. ఆదాయం పెంచాలి.. పేదలకు పంచాలి అనే ఆశయంతో ఈ ప్రభుత్వం పని చేస్తోందని రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు,కొండా సురేఖ, ఎంపి గోడం నగేశ్, స్థానిక ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రైవింగ్ లైసెన్స్‌కు కొత్త టెస్ట్!

**లెర్నింగ్ లైసెన్స్‌కు ముందు ఆన్‌లైన్ పరీక్ష .. దాంట్లో పాసైతేనే లెర్నింగ్, శాశ్వత లైసెన్స్**
**ప్రస్తుత రెండంచెల విధానం స్థానంలో మూడంచెల విధానం!**
**రోడ్డు ప్రమాదాల నివారణకు సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో రవాణాశాఖ కసరత్తు**
**అధ్యయనానికి కమిటీ నియామకం**

**హైదరాబాద్, ఏప్రిల్ 6 (ప్రజావినికిడి):** రహదారులపై జరుగుతున్న ప్రమాదాల్లో ఎక్కువగా అతివేగం, నిర్లక్ష్యం, రోడ్డు భద్రత ప్రమాణాలపై అవగాహన లేకుండా వాహనాలు నడుపుతుండటం వల్ల జరుగుతున్నవే ఉంటున్నాయి. దేశవ్యాప్తంగా ఏటా రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్న వారి సంఖ్య లక్షకుపైగానే ఉంటోంది. ఈ నేపథ్యంలో, యాక్సిడెంట్ల నివారణకు వీలుగా రోడ్డు భద్రత చర్యలు చేపట్టాలని ఇటీవల సుప్రీంకోర్టు అన్ని రాష్ట్రాల ప్రభుత్వాల్ని ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర రవాణాశాఖ కసరత్తు ప్రారంభించింది. అందులో భాగంగా డ్రైవింగ్ లైసెన్సు జారీలో మూడంచెల విధానం అమల్లోకి తేవాలని భావిస్తోంది. సాధ్యాసాధ్యాల్ని పరిశీలించి సమగ్ర వివరాలతో నివేదిక రూపొందించేందుకు రవాణాశాఖలో వివిధ విభాగాల నుంచి ఆరుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసారు. కమిటీ నివేదిక ఈ నెలాఖరుకు వచ్చే అవకాశం ఉంది. నివేదిక అందిన తర్వాత అన్ని అంశాల్ని పరిశీలించి వీలైనంత త్వరగా నూతన విధానం అమలు చేసేందుకు రవాణా శాఖ అధికారులు సిద్ధమవుతున్నారు.

**ఇంటి నుంచే ఆన్‌లైన్ టెస్ట్‌కు హాజరుకావచ్చు**

డ్రైవింగ్ లైసెన్సు జారీలో ప్రస్తుతం రెండంచెల విధానం అమల్లో ఉంది. తొలుత లెర్నర్స్ లైసెన్సు రిజిస్ట్రేషన్ (ఎల్ఎల్ఆర్) పరీక్ష, ఆ తర్వాత ట్రాక్‌పై డ్రైవింగ్ పరీక్ష నిర్వహించి శాశ్వత లైసెన్సు మంజూరు చేస్తున్నారు. వీటికి తోడుగా కొత్తగా ఆన్‌లైన్ రోడ్ సేఫ్టీ అవేర్‌నెస్ మాడ్యూల్స్ టెస్ట్ పేరుతో మూడో దశను కూడా ప్రవేశపెట్టనున్నారు. నూతన విధానం అమల్లోకి వస్తే... ఎల్ఎల్ఆర్‌కు దరఖాస్తు చేసుకునే ముందే.. ఆన్‌లైన్ రోడ్ సేఫ్టీ అవేర్‌నెస్ మాడ్యూల్ టెస్ట్‌లో పాస్ కావాల్సి ఉంటుంది. ఈ పరీక్ష రహదారి భద్రతకు సంబంధించిన పలు అంశాలతో కూడి ఉంటుంది. ఆన్‌లైన్ టెస్ట్ కాబట్టి.. ఇంటి నుంచే హాజరుకావచ్చు. దీనిలో పాసైతే ఎల్ఎల్ఆర్‌కు దరఖాస్తు చేసుకుని, ఆ తర్వాత శాశ్వత లైసెన్సు తీసుకోవాలి. రోడ్ సేఫ్టీ అవేర్‌నెస్ మాడ్యూల్స్ టెస్ట్‌లో ఏయే అంశాలను చేర్చాలి, ఎంత సమయం ఆ పరీక్ష నిర్వహించాలి అన్నదానిపై అధ్యయనం జరుగుతోందని, కమిటీ నివేదిక తర్వాత స్పష్టత వస్తుందని రవాణాశాఖ అధికారులు తెలియజేశారు. రోడ్డు ప్రమాదం వల్ల జరిగే నష్టాలు, బాధిత కుటుంబాల ఆవేదన, వాహనం నడిపే సమయంలో తీసుకోవాల్సిన కనీస జాగ్రత్తలపై వీడియో క్లిప్పింగ్స్ చూపించి వాటి ఆధారంగా టెస్ట్ ఉండేలా చూస్తున్నామని ఒక అధికారి వెల్లడించారు.

# హామీలు నెరవేరుస్తున్నాం

**.మొదటిపేజీ తరువాయి**




పోరాటయోధుడు కుమురంభీం స్ఫూర్తితో ప్రజాపాలన తీసుకురావడానికి పోరాటాల పురిటిగడ్డ ఇంద్రవెల్లి నుంచి టీపీసీసీ నాయకుడిగా యాత్ర ప్రారంభిస్తే సీఎల్పీ నేతగా భట్టి విక్రమార్క పిప్రి గ్రామం నుంచి పీపుల్స్ మార్చ్ పాదయాత్ర చేపట్టారని గుర్తు చేశారు. ఆనాడు ప్రజలకు ఇచ్చిన హామీలను నేడు ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామన్నారు. ఆదిలాబాద్ జిల్లా ప్రజల గుండెల నిండా అభిమానం ఉందని, మహబూబ్‌నగర్‌ను ఏ విధంగానైతే అభివృద్ధి చేస్తానో ఆదిలాబాద్‌ను కూడా అదే విధంగా అభివృద్ధి చేస్తానని చెప్పారు. రాబోయే గోదావరి పుష్కరాలకు నిధులు కేటాయించడంతోపాటు బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధిలో భాగంగా మొట్టమొదటిగా గూడెం సత్య నారాయణ స్వామి ఆలయానికి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా త్వరలోనే గిరిజన యునివర్సిటీ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. జిల్లాలు పారిశ్రామికపరంగా, పర్యాటక కేంద్రంగా అభివృద్ధిపర్చడమే కాకుండా 2034 నాటికి విద్యాకేంద్రంగా ఆదిలాబాద్‌ను తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి వస్తానని, వచ్చిన ప్రతిసారీ నిధులు కేటాయిస్తానని చెప్పారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించిన సీఎం, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించామని, ఇందుకు రూ.10వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.22,500 కోట్లతో 4.5లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని చెప్పారు. ఇప్పటివరకు రూ.5,400 కోట్లు లబ్దిదారుల ఖాతాల్లో జమ చేసినట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, ఎంపీ గొడెం నగేష్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జుపటేల్, అనిల్‌జాదవ్, రామారావ్ పటేల్, మహేశ్వర్‌రెడ్డి, ప్రేంసాగర్‌రావ్, కలెక్టర్లు రాజర్షి షా, అభిలాష అభినవ్, హరిత, కుమార్ దీపక్, ఎస్పీలు అఖిల్ మహాజన్, జానకి షర్మిల, ఉమ్మడి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# జాబిల్లి చెంతకు ఆర్టెమిస్2

**భూమి నుంచి రికార్డు దూరంలో**
**1970లో అపోలో 13 కంటే 2,500 కి.మీ అదనం**
**10న పసిఫిక్ మహాసముద్రంలో**
**ల్యాండింగ్ అయ్యే అవకాశం : శాస్త్రవేత్తలు**

**న్యూయార్క్**: అమెరికా అంతరిక్ష సంస్థ-నాసా చేపట్టిన ఆర్టెమిస్-2 యాత్ర కీలక దశలోకి చేరింది. ఈ మిషన్‌లో భాగంగా నలుగురు వ్యోమగాములు చంద్రుడి గురుత్వాకర్షణ పరిధిలోకి ప్రవేశించారు. వారిని తీసుకెళ్లిన ఒరాయన్ వ్యోమనౌక.. 4,06,773కి.మీ దూరం ప్రయాణించి అత్యంత సుదూర మానవ అంతరిక్ష యాత్రగా రికార్డు సృష్టించింది. 1970లో అపోలో 13 ప్రయాణించిన దూరం కంటే ఇది 2,500 కి.మీ అదనం కావడం గమనార్హం.ఈ క్రమంలోనే 'లూనార్ ఫ్లైబై' దశ చోటుచేసుకోనుంది. ఆ విన్యాసంతో ఒరాయన్.. చందమామను దాటి 6,400 కిలోమీటర్లు దూరం వెళుతుంది. ఈ క్రమంలో.. మనకు ఎప్పుడూ కనిపించని చంద్రుడి రెండో పార్శ్వాన్ని వ్యోమగాములు క్లిక్ మనిపిస్తారు. చంద్రుడి చుట్టూ ప్రయాణం పూర్తి చేశాక ఈ వ్యోమనౌక భూమి వైపు మళుతుంది. ఈ నెల 10న పసిఫిక్ మహాసముద్రంలో ల్యాండింగ్ ఉండొచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు.



# ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి... గెజిట్ విడుదల చేసిన కేంద్రం

**ఏప్రిల్ 6 (ప్రజావినికిడి):**
ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి పూర్తి చట్టబద్ధత ఏర్పడింది. అమరావతిని ఏపీ ఏకైక రాజధానిగా గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం నేడు అధికారికంగా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్రపతి ఆమోదం తర్వాత కేంద్ర న్యాయశాఖ ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేయడంతో అమరావతికి సంపూర్ణ చట్టబద్ధత లభించినట్లయింది.ఇటీవల ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో అమరావతి రాజధాని సవరణ బిల్లును రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేసి పార్లమెంటుకు పంపిన విషయం తెలిసిందే. అక్కడ లోక్‌సభ, రాజ్యసభ రెండూ ఈ బిల్లుకు ఆమోదం తెలిపాయి. అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతకం చేయడంతో, దీనికి అధికారిక ముద్ర పడింది. ఈ ప్రక్రియలన్నీ పూర్తవడంతో కేంద్ర న్యాయశాఖ తుది నోటిఫికేషన్ జారీ చేసింది.

2014 నాటి సీఆర్డీయే చట్టంలో పొందుపరిచిన అమరావతిని రాజధానిగా నోటిఫై చేస్తున్నట్లు ఇందులో స్పష్టం చేసింది. ఈ సవరణ చట్టం 2024 జూన్ 2వ తేదీ నుంచే అమల్లోకి వచ్చినట్లుగా (retrospective effect) గెజిట్‌లో స్పష్టంగా పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014లోని సెక్షన్ 5, సబ్-సెక్షన్ (2)లో ఉన్న "కొత్త రాజధాని ఉంటుంది" (a new capital) అనే పదబంధం స్థానంలో "అమరావతి కొత్త రాజధానిగా ఉంటుంది" (Amaravati shall be the new capital) అని మార్పు చేశారు.ఈ సవరణ ద్వారా 'అమరావతి' అనే పదానికి కూడా చట్టంలో స్పష్టత ఇచ్చారు. 'అమరావతి' అనగా ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (జ=ణూ) చట్టం, 2014 నిబంధనల ప్రకారం నోటిఫై చేయబడిన రాజధాని నగర ప్రాంతాలు అని వివరణ జోడించారు. రాష్ట్రపతి ఆమోదం, గెజిట్ ప్రచురణతో ఈ చట్ట సవరణ పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చినట్లయింది.

# ఒక్క రాత్రిలో ఇరాన్‌ను తుడిచిపెట్టగలం

**మొదటిపేజీ తరువాయి**

విజయవంతంగా రక్షించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఇరాన్‌ను 'దుష్టశక్తి'గా అభివర్ణించిన ట్రంప్, ఆ దేశ పౌర మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తామంటూ గతంలో సోషల్ మీడియాలో చేసిన హెచ్చరికలను పునరుద్ఘాటించారు.ఈ రెస్క్యూ ఆపరేషన్‌ను 'చారిత్రాత్మకం'గా అభివర్ణించిన ట్రంప్, అమెరికా సైన్యం ఏ ఒక్క అమెరికన్‌ను వెనుక వదిలిపెట్టదని స్పష్టం చేశారు. ఈ ఆపరేషన్‌లో మొత్తం 155 విమానాలు పాల్గొన్నాయని, వాటిలో 4 బాంబర్లు, 64 ఫైటర్ జెట్లు, 48 రీఫ్యూయలింగ్ ట్యాంకర్లు, 13 రెస్క్యూ విమానాలు ఉన్నాయని వివరించారు. వేలాది మంది ఇరాన్ సైనికులు గాలిస్తుండగా, వారిని తప్పుదోవ పట్టించేందుకు సైనికుడు వేరే ప్రాంతంలో ఉన్నాడనే భ్రమ కల్పించి ఈ ఆపరేషన్ పూర్తి చేశామన్నారు. దాదాపు 48 గంటల పాటు ఇరాన్ దళాలకు చిక్కకుండా ఆ 'వీర సైనికుడు' తప్పించుకు తిరిగాడని ప్రశంసించారు. తీవ్రంగా గాయపడినప్పటికీ, రక్తం కారుతున్నా ఆ సైనికుడు కొండచరియలు ఎక్కి తన లొకేషన్‌ను చేరవేశాడని ట్రంప్ చెప్పారు. ఆపరేషన్ అనంతరం వెనుక వదిలేసిన తమ విమానాల్లోని సాంకేతికత ఇరాన్‌కు చిక్కకుండా ఉండేందుకు, వాటిని పూర్తిగా పేల్చివేసినట్టు ట్రంప్ వెల్లడించారు.

అయితే, ఈ రెస్క్యూ ఆపరేషన్‌కు సంబంధించిన సమాచారాన్ని కొన్ని మీడియా సంస్థలు ముందుగానే లీక్ చేయడంపై ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ లీక్ వల్ల అమెరికా సైనికుల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడిందని ఆరోపించారు. "ఇది చాలా దారుణం. ఈ లీక్‌కు కారణమైన వ్యక్తిని మేం కచ్చితంగా పట్టుకుంటాం. వార్తను ప్రచురించిన మీడియా సంస్థ వద్దకు వెళ్లి, జాతీయ భద్రత దృష్ట్యా సోర్స్‌ను అప్పగించమని కోరతాం, లేదంటే జైలుకు వెళ్లాల్సి వస్తుంది" అని ట్రంప్ నేరుగా హెచ్చరించారు.

# ఒకేసారి 9 మంది పోలీసులకు ఉరిశిక్ష... మధురై కోర్టు సంచలన తీర్పు



**మధురై ఏప్రిల్ 6 (ప్రజావినికిడి):** దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన తమిళనాడులోని సాతంకుళం కస్టడీ మరణాల కేసులో మధురై కోర్టు చారిత్రక తీర్పు వెలువరించింది. తండ్రీకొడుకులైన జయరాజ్, బెన్నిక్స్‌ల మృతికి కారణమైన తొమ్మిది మంది పోలీసులను దోషులుగా తేల్చి, వారికి మరణ శిక్ష విధించింది. సోమవారం మదురై మొదటి అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి జి. ముత్తుకుమారన్ ఈ తీర్పును ప్రకటించారు. ఈ కేసును "అత్యంత అరుదైన కేసు" (రేర్ ఆఫ్ ది రేరెస్ట్)గా అభివర్ణించిన న్యాయమూర్తి, రక్షించాల్సిన పోలీసులే భక్షకులుగా మారారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.ఈ కేసులో దోషులుగా తేలిన వారిలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్. శ్రీధర్, సబ్ ఇన్‌స్పెక్టర్లు పి. రఘు గణేశ్, కె. బాలకృష్ణన్, హెడ్ కానిస్టేబుల్స్ ఎస్. మురుగన్, ఏ. సామిదురై, కానిస్టేబుల్స్ ఎం. ముత్తురాజ్, ఎస్. చెల్లదురై, థామస్ ఫ్రాన్సిస్, ఎస్. వెయిలుముత్తు ఉన్నారు. విచారణ సమయంలో పదో నిందితుడైన రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ పాల్‌దురై కోవిడ్‌తో మరణించాడు.కేసు నేపథ్యం: 2020 జూన్ 19న, కోవిడ్-19 లాక్‌డౌన్ నిబంధనలు ఉల్లంఘించి రాత్రి 9 గంటల తర్వాత దుకాణం తెరిచి ఉంచారనే ఆరోపణలతో సాతంకుళం పోలీసులు వ్యాపారులైన పి. జయరాజ్, ఆయన కుమారుడు బెన్నిక్స్‌ను అరెస్టు చేశారు. పోలీస్ స్టేషన్‌లో వారిని అత్యంత అమానుషంగా, క్రూరంగా హింసించినట్టు ఆరోపణలు ఉన్నాయి. తీవ్ర గాయాలపాలైన వారిపై తప్పుడు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ హింస కారణంగా బెన్నిక్స్ జూన్ 22న, జయరాజ్ జూన్ 23న చికిత్స పొందుతూ మరణించారు. ఎలాంటి నేరచరిత్ర లేని వారి మరణం దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహానికి కారణమైంది.మొదట మదురై హైకోర్టు సుమోటోగా కేసును స్వీకరించగా, ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం దర్యాప్తును సీబీఐకి అప్పగించింది. సీబీఐ విచారణలో పోలీసుల దారుణాలు బయటపడ్డాయి. పోస్ట్‌మార్టం నివేదికలు కూడా వారిద్దరి మరణానికి తీవ్రమైన గాయాలే కారణమని స్పష్టం చేశాయి. సీబీఐ వాదనలను పరిగణనలోకి తీసుకున్న కోర్టు, మార్చి 23న తొమ్మిది మందిని దోషులుగా నిర్ధారించి, సోమవారం వారికి శిక్ష ఖరారు చేసింది. దోషులందరికీ మరణ శిక్షతో పాటు, బాధిత కుటుంబానికి రూ.1.40 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించింది.

# హామిాలను అమలు చేసిన ఘనత మాది

**.మొదటిపేజీ తరువాయి**

కోసం 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశాం. తొలి ఏడాదిలోనే మొత్తం 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాం. ప్రతి నియోజకవర్గంలో అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపట్టాం. ఇన్ని పథకాలు, హామీలు ఎలా అమలు చేయగలుగు తున్నారని ఇతర రాష్ట్రాల నేతలు అడుగుతున్నారు. ఈ రాష్ట్రంలో పుట్టడం అదృష్టంగా ప్రజలు భావించే పరిస్థితులు ఉండాలని భావించాం. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి వర్తించేలా రూ.5 లక్షలతో ఇందిరమ్మ బీమా పథకం తీసుకొచ్చాం. రైతు కుటుంబాల నుంచి వచ్చిన మాకు పేదల కష్టాలు, అవసరాలు తెలుసు. ప్రజల సంక్షేమం తప్ప.. మాకెవరికీ వ్యక్తిగత ప్రయోజనాలు లేవని భట్టి విక్రమార్క అన్నారు.

------

# ఉమ్మడి పౌరస్మృతి, జమిలి ఎన్నికలు అమలు దిశగా అడుగులు

**.మొదటిపేజీ తరువాయి**

33 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి కట్టుబడి ఉందని తెలిపారు. 2029లో జరిగే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు జరిగే ఎన్నికల్లో ఈ రిజర్వేషన్లు అమలు అయ్యేలా చూస్తామని మోదీ హామీ ఇచ్చారు. కాంగ్రెస్ హయాంలో ఎమర్జెన్సీ, ప్రతిపక్షాలపై దాడులు వంటి ఎన్నో అణచివేతలను భాజపా కార్యకర్తలు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉత్సాహపరిచేలా పలు అంశాలను పేర్కొన్నారు. మన కార్యక్రమం చురుగ్గా ముందుకెళుతోంది. ఉమ్మడి పౌరస్మృతి, జమిలి ఎన్నికలపై తీవ్రంగా చర్చలు జరుగుతున్నాయి. మంచి పురోగతి కనిపిస్తోంది. అభివృద్ధి చెందిన దేశంగా మార్చడానికి భాజపా కట్టుబడి ఉంది. బ్రిటీష్ కాలం నాటి చట్టాలను రద్దు చేశాం. కొత్త పార్లమెంట్ భవనాన్ని నిర్మించుకున్నాం. జనరల్ కేటగిరీలో 10 శాతం రిజర్వేషన్లు, ట్రిపుల్ తలాక్ రద్దు, పౌరసత్వ సవరణ చట్టం, అయోధ్యలో రామ మందిర నిర్మాణం వంటివి చేపట్టాం అని ప్రధాని మోదీ అన్నారు. 'ఆర్టికల్ 370 రద్దు అసాధ్యమని చాలా మంది వాదించారని, కానీ దాన్ని చేసి చూపించామని ప్రధాని మోదీ అన్నారు. ఆర్టికల్ 370 రద్దు అసాధ్యమని భావించారని, కానీ రద్దు చేసి చూపించామని అన్నారు. అలాగే, ఎన్డీయే కూటమి కూడా 25 ఏళ్లు పూర్తి చేసుకుందని ప్రధాని మోదీ అన్నారు. ప్రజల కోసం, జాతి ప్రయోజనాల కోసం ఈ కూటమి పనిచేస్తోందన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
మంగళవారం 7 ఏప్రిల్ 2026

# కేపీ మొండోడు..
# ప్రాణం పోయినా పట్టు వదలడు..

**ప్రముఖ సినీ నిర్మాత,నటుడు బండ్ల గణేష్.. జర్నలిస్ట్ కేపీకి నా సినిమాల్లో అవకాశం**




**షాద్ నగర్,(ప్రజావినికిడి):**జైలులో పెట్టి నిర్బంధించారు.. కేసులు పెట్టి వేధించారు.. అయినా పట్టువదలని విక్రమార్కుడులా ముందుకు సాగుతూనే ఉన్నాడు.. జర్నలిస్ట్ ఖాజపాషా (కేపీ) మొండోడు..ఎవరి మాట వినడు.. అంటూ సినీ నటుడు,నిర్మాత బండ్ల గణేష్ ప్రశంసించారు. షాద్ నగర్ సీనియర్ జర్నలిస్ట్ కేపీ,శ్యామల దంపతుల జన్మదినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన సినీ నిర్మాత బండ్ల గణేష్ జన్మదిన వేడుకల సందర్భంగా మాట్లాడుతూ, షాద్ నగర్ కంట్రీ సైడ్ క్లబ్ రిసార్ట్ లో ఏర్పాటుచేసిన జన్మదిన వేడుకల సందర్భంగా మాట్లాడుతూ, భవిష్యత్తులో కేపి రాష్ట్ర స్థాయిలో నాయకుడు అయినా ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదని అన్నారు. భవిష్యత్తులో తన సినిమాలో జర్నలిస్ట్ కేపీకి తప్పకుండా అవకాశం ఉంటుందని అన్నాడు. అనుకున్న లక్ష్యం కోసం ప్రాణాలను కూడా లెక్కచేయని కేపీ లాంటి వ్యక్తులను కాపాడుకోవాల్సిన అవసరం,బాధ్యత అందరి పైన పైన ఉందన్నారు. కేపీలో ఎన్నో కలలు దాగి ఉన్నాయని, అతనికి మంచి భవిష్యత్తు ఉంటుందని ప్రశంసించారు.కేపీ లాంటి వ్యక్తులకు తన సహకారం ఎప్పుడూ ఉంటుందని, ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి తదితర మిత్ర బృందం ఎల్లప్పుడు తనకు అండగా ఉండాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొనడం విశేషం. జర్నలిస్ట్ కెపికి ఉన్న ప్రతిభ వల్ల అతనికి తన సొంత సినిమాల్లో తప్పకుండా అవకాశం కల్పిస్తానని స్పష్టం చేశారు.

## జర్నలిస్ట్ కేపీ లాంటి వ్యక్తులు చాలా అరుదు..

**షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి.. - జర్నలిస్టు కుటుంబంతో ప్రత్యేక అనుబంధం**




**షాద్ నగర్,(ప్రజావినికిడి):**జర్నలిస్టుగా, కళాకారుడిగా, సమాజ సేవకుడిగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఇంతింతై ఎదుగుతున్న జర్నలిస్టు కేపీ లాంటి వ్యక్తులు చాలా అరుదుగా ఉంటారని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాపరెడ్డి అన్నారు. స్థానిక సీనియర్ జర్నలిస్టు కేపీ జన్మదిన వేడుకల సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితరులతో కలిసి ఆయన కార్యక్రమానికి హాజరయ్యారు. ఒకే వ్యక్తి అనేక మార్గాలలో ప్రయాణం చేయడం ప్రశంసనీయమని, అది ఎవరి వల్ల కాదని స్పష్టం చేశారు.షాద్ నగర్ సీనియర్ జర్నలిస్ట్ కేపీ కుటుంబంతో ఎంతో అనుబంధం ఉందని,వారి తల్లిగారు తమను బిడ్డలా చూసుకునే వారని పేర్కొన్నారు.ఆమె నాకు సొంత అక్కల భావిస్తానని, చిన్ననాటి నుండి ఈ కుటుంబంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని,ఇంత మంచి కార్యక్రమాన్ని షాద్ నగర్ లో నిర్వహించడం, ఇలాంటి కార్యక్రమానికి తాను రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.కేపీ కేపి,శ్యామల దంపతులను శాలువాలతో సత్కరించిన ఆయన జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఇంత చక్కని పాటలతో ఇంత పెద్ద ఎత్తున కార్యక్రమం ఏర్పాటు చేయడం ఈ ప్రాంతంలో ఇదే ప్రధమమని ఇలాంటి గొప్ప కళాకారులను ఈ ప్రాంతానికి పరిచయం చేసిన కేపికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## పేదవారి సొంతింటి కలను నెర వేర్చిన మహోన్నత నాయకుడు కేసీఆర్

**ప్రజా సంక్షేమం కోసం పనిచేసే ఏకైక పార్టీ బిఆర్ఎస్ మాత్రమే..**

**బిఆర్ఎస్ ఎల్పి విప్,ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్..**



**కుత్బుల్లాపూర్,(ప్రజావినికిడి):** జిహెచ్ఎంసి దుండిగల్ సర్కిల్ పరిధి బహదూర్ పల్లిలోని డబుల్ బెడ్ రూమ్ 2 బీహెచ్కే ఇళ్ల సముదాయంను ఆదివారం సాయంత్రం బిఆర్ఎస్ ఎల్పి విప్,ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ పర్యటించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,పేదవారి సొంతింటి కలను నెరవేర్చేందుకు విలువైన ప్రభుత్వ భూములను కేటాయింప చేసి విశాలవంతమైన రెండు పడక గదులను నిర్మింప చేసి పేదవాడి ఆత్మగౌరవాన్ని చాటేలా వారి సొంతింటి కలను నెరవేర్చిన మహోన్నత నాయకులు కేసీఆర్ అని అన్నారు.డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాలలోని మౌలిక వసతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని,ఇప్పటికే విద్యుత్ మీటర్ల, ఆస్తి పన్ను, మంజీరా నీటి సరఫరా వంటి ఇబ్బందులను ఎప్పటికప్పుడు అధికారులకు ఆదేశాలిస్తూ పరిష్కరిస్తున్నామని రానున్న రోజుల్లో కూడా ఇంకా ఏమైనా సమస్యలు మిగిలి ఉంటే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయంలోని లబ్ధిదారులంతా ఒక తాటిపై ఉన్నట్లయితే అభివృద్ధి సాధ్యమన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పద్మా రావు,మాజీ కౌన్సిలర్లు సగ్గిడి శ్రీనివాస్, సత్యనారాయణ, మాజీ సర్పంచ్ సగ్గిడి క్రిష్ణ, కొమురయ్య యాదవ్, నాయకులు శ్యామ్,ద్వారక్, నర్సింగ్ రావు, జనార్దన్,శ్రీకాంత్, శ్రవణ్,సద్దాం, 2బిహేచ్కే సొసైటీ సభ్యులు ప్రసాద్, దేవ కుమార్, ముస్తఫా, జహంగీర్ భాయ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అనువల్ డే వేడుకలు





**ఎల్బీనగర్, (ప్రజావినికిడి):**అవంతి డిగ్రీ పీజీ కాలేజ్ బర్కత్పురా, నారాయణగూడ, దిల్ సుక్ నగర్ బ్రాంచ్ ల 35 వ అనువల్ డే వేడుకలు హైదరాబాదులోని నాగోల్ లో ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకల్లో జూనియర్, సీనియర్ విద్యార్థులు పాల్గొని ఆటపాటలతో వినూత్న కార్యక్రమాలతో అలరించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కుమార్ పాల్గొన్నారు.అవంతి గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్ వ్యవస్థాపకులు అవంతి శ్రీనివాస్ పాల్గొని విద్యార్థులకు సూచనలు అందించారు.
అవంతి శ్రీనివాస్ మాట్లాడుతూ, విద్యార్థులు అందరూ చదువుతోపాటు నైపుణ్యం ఉన్నట్లయితే విద్యార్థులు ఏ డిగ్రీ కోర్స్ చదివిన నైపుణ్యం ఉంటే ఏవృత్తిలో అయిన రాణించగలన్నారు.అవంతి గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ గత 35 సంవత్సరాలుగా ఇరు తెలుగు రాష్ట్రాల్లో ఐదు లక్షల మంది పైగా విద్యార్థులు విద్యను అభ్యసించారని అన్నారు.రాబోయే రోజుల్లో అవంతి గ్రూపును యూనివర్సిటీ స్థాయిలో తీసుకురావడమే తమ లక్ష్యమని అన్నారు.తమ విద్యాసంస్థల్లో చదువుకునే విద్యార్థులకు ఎక్కువ మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు అందించడమే తమ విద్యా విధానమని అన్నారు. విద్యార్థులు చదువుకుంటేనే ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగ అవకాశాలు, బిజినెస్ అవకాశాలు ఉంటాయని సూచించారు.గత 35 సంవత్సరాలుగా నాణ్యమైన విద్యను అందిస్తున్న ఉపాధ్యాయులకు కళాశాలల బృందానికి ధన్యవాదాలు తెలిపారు.

# హిందూ బంధువులు ఐక్యతతో ఉండాలి





**నాగోల్,(ప్రజావినికిడి):**
హిందూ బంధువులు అందరూ ఐక్యతతో ఉండాలని విశ్వ హిందు పరిషత్ జాతీయ అధికార ప్రతినిధి డాక్టర్ రావినూతల శశిధర్ అన్నారు. ఈ సందర్భంగా నాగోల్ జై పూరి కాలనీ విశ్వ హిందు పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం ఎగ్గే మల్లేశం ఫంక్షన్ హాల్ లో హిందూ సమ్మేళన సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమం శ్రీనివాస్,ఎల్లం పంతుల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బ్రహ్మశ్రీ పాశర్లపాటి శ్రీనివాస్ బంగారయ్య, విశ్వహిందు పరిషత్ జాతీయ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్,మహిళా వక్త నవత పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భారతదేశం సనాతన ధర్మం కల దేశమని హిందువులందరూ బంధువులుగా మెలగాలని అన్నారు.ప్రతి ఒక్కరూ దేవుళ్ళను పూజిస్తూ మన హిందూ సనాతన ధర్మాన్ని కాపాడాలని సూచించారు.మన పూర్వీకుల అస్తిత్వాన్ని కాపాడుతూ హిందువులందరం కలిసిమెలిసి ఉండాలని అన్నారు. హిందువులందరూ కులాల అతీతంగా కలిసి ఉండాలని గడప లోపల మన కులంగా గడప దాటితే హిందువులం అని ఈ లోకానికి చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ బిజెపి ఇన్చార్జ్ సామారంగారెడ్డి, పద్మా రెడ్డి నాగోల్ డివిజన్ బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ సమస్యలు
# వారం రోజుల్లో పరిష్కరించకపోతే మెరుపు సమ్మె

**నాంపల్లి,(ప్రజావినికిడి):**
కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ సమస్యలు వారం రోజుల్లో సమస్యలు పరిష్కరించకపోతే మెరుపు సమ్మెకు దిగుతామని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఎల్పిజి గ్యాస్ డెలివరీ వర్కర్స్ యూనియన్ హెచ్చరించింది. తెలంగాణ రాష్ట్రంలోని ఆరు వందల గ్యాస్ ఏజెన్సీలలో 60 వేల మంది కార్మికులు పని చేస్తున్నారని తెలంగాణ కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ ట్రేడింగ్ అధ్యక్షుడు నకిరే కంటి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. హైదరాబాద్ బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ లో తెలంగాణ కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ కార్యవర్గ సభ్యుల సమావేశం నిర్వహించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఎల్పీజీ గ్యాస్ సరఫరా సజావుగా అందించాలని ప్రత్యేకంగా ఉత్తర్వులు జారీ చేస్తే ఆ ఉత్తర్వులకు విరుద్ధంగా రాష్ట్రంలోని ఎల్పిజి గ్యాస్ డిస్ట్రిబ్యూటర్స్ డీలర్స్ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గ్యాస్ డెలివరీ బాయ్స్ చేత అక్రమంగా రేపిల్లింగ్ సిలిండర్ల సరఫరా చేయాలని వేధింపులకు పాల్పడుతున్నారని వెల్లడించారు. పోలీసులు డెలివరీ బాయ్స్ అరెస్టు చేస్తూ యాజమాన్యాలను వదిలేయడం చాలా ఇబ్బందికరమైన పరిణామమని పేర్కొన్నారు.గత 12 సంవత్సరాల నుంచి తెలంగాణ రాష్ట్రంలో డెలివరీ బాయ్స్ గా పనిచేస్తున్న ఏ ఒక్క కార్మికుడికి కార్మిక చట్టం ప్రకారం యాజమాన్యాలు జీతాలు, వసతులు కల్పించడం లేదని దుయ్యబట్టారు.



ఇటీవల డెలివరీ బాయ్స్ ని స్థానిక రౌడీషీటర్లు సిలిండర్లు ఎత్తుకెళ్తున్నారని ఈ నేపథ్యంలో వీరికి ప్రత్యేకంగా రక్షణ కల్పించాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వంద శాతం ఓటిపి వచ్చిన సిలిండర్లు మాత్రమే డెలివరీ చేయాలని ఒత్తిడి తెస్తున్నారని, వృద్ధులకు, నిరక్షరాస్యులకు ఓటీపీ చెప్పాలంటే చాలా ఇబ్బంది ఎదుర్కొంటున్నారని వివరించారు. ఈ కేవైసీ కూడా డెలివరీ బాయ్స్ చేయాలని వత్తిడి చేయడంతో పాటు 10 నుంచి 12 గంటల పాటు డెలివరీ చేయిస్తూ మేనేజర్ లు డబ్బులు రాత్రి 11గంటల వరకు ఆఫీసులో కూర్చోపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వినియోగదారుల ఫోన్లు, డిస్ట్రిబ్యూషన్ కార్యాలయ ఫోన్లో చేసి వేధింపులకు పాల్పడుతున్నారని దీనివల్ల బాయ్స్ విపరీతమైన ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. యాక్సిడెంట్లకు, గుండె పోటు వంటి సమస్యలు ఎదురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తమ సమస్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,కార్మిక శాఖ మంత్రి వివేక్, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి స్పందించాలని కోరారు.వారం రోజుల్లో సమస్యలు పరిష్కరించకపోతే మెరుపు సమ్మె చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరించారు. కార్యక్రమంలో గౌరవ సలహాదారులు చామకూర రాజు, కెవి గౌడ్,గడ్డం సత్యనారాయణ, నల్ల లక్ష్మణ్, యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండి యూనిస్, ప్రధాన కార్యదర్శి బుర్ర చంద్రయ్య, ఉపాధ్యక్షులు పైసా నర్సింగ్,గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు ఎర్రోళ్ల నర్సింగ్,రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఫయీమ్,అశోక్ వెంకట్,రవి తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్రా యాత్ర ను విజయవంతంగా పూర్తి చేసిన యాత్రికులు

**ఉమ్రా యాత్రకు వెళ్లే వారు ఎలాంటి అపోహాలకు గురి కావద్దు -ఆల్ విజన్ టూర్స్ అండ్ ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఫయాజ్ అలీ**






**శంషాబాద్,(ప్రజావినికిడి):**ఇజ్రాయెల్, అమెరికా,ఇరాన్ యుద్ధం కారణంగా ఉమ్రా యాత్రికులు తీవ్ర భయాందోళనలకు గురౌతున్నారు. అయితే ఉమ్రా యాత్రికులు ఎలాంటి భయాందోళనకు గురికారాదని ఆల్ విజన్ టూర్స్ అండ్ ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఫయాజ్ అలీ తెలిపారు.భారత్ లోని వివిధ రాష్ట్రాలకు చెందిన యాత్రికులు శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుండి బయలుదేరి వెళ్లిన ఉమ్రాయాత్రను విజయవంతంగా పూర్తి చేసికొని సోమవారం తిరిగి శంషాబాద్ ఎయిర్ పోర్ట్ చేరుకున్నారు. అయితే శంషాబాద్ ఎయిర్ పోర్ట్ కు చేరుకున్న యాత్రికులను కుటుంబ సభ్యులు పూలమాలతో సత్కరించి స్వాగతం పలికారు.ఆల్ విజన్ టూర్స్ అండ్ ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఫయాజ్ అలీ మాట్లాడుతూ, భగవంతుని సన్నిధికి చేరుకునేందుకు ఎలాంటి సందేహాలు పెట్టుకోవద్దని దేవుడి కృప మనపై ఉంటే ఎక్కడికైనా విజయవంతంగా చేరుకుని వస్తామని ధీమా వ్యక్తం చేశారు.తన వెంట వచ్చిన ఉమ్రా యాత్రికులు ఎక్కడ కూడా ఎలాంటి అసౌకర్యానికి గురి కాలేదని అన్నారు. ఉమ్రా యాత్రకు వెళ్లే వారు ఎలాంటి అపోహాలకు గురి కావద్దని అన్నారు. యుద్ధం కారణంగా అనేకమంది భయభ్రాంతులకు గురవుతున్న సంగతి తెలిసిందే. కానీ స్వయంగా ఉమ్రా యాత్ర చేసిన తమకు అక్కడ పరిస్థితి ఏంటో తెలుసునని అన్నారు.ప్రశాంత వాతావరణంలో మక్కా, మదీనాలలో ప్రత్యేక ప్రార్థనలు చేశామని తెలిపారు.భారత దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు తమ ఉమ్రా యాత్రలో ఉన్నారని తెలిపారు.పెద్దలే కాదు చిన్న పిల్లలు కూడా తమ వెంట వచ్చారని ఎవరికి కూడా ఎలాంటి అసౌకర్యం కలగలేదని అన్నారు.ఉమ్రా యాత్ర చేసే వారు వచ్చేనెల 20 తేది లోపు తమను సంప్రదించాలని కోరారు.

# చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
షాద్ నగర్ ఎమ్మెల్యే చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రము ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.అక్కడ ఉన్న డాక్టర్ స్రవంతి తో మాట్లాడుతూ, ప్రతిరోజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఎంత ఓ.పి వస్తుంది అని అడిగి తెలుసుకున్నారు.అలాగే మీ పిహెచ్సిలో ఎలాంటి సేవలు అందిస్తున్నారు అని,ఎన్ని బెడ్లు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు.మీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఇంకా ఏమైనా సేవలు అవసరము ఉన్నాయా అని కూడా అడిగారు.దానికి బదులుగా డాక్టర్ స్రవంతి మాట్లాడుతూ, మా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్ నర్స్ ల కొరతా ఉందని,స్టాఫ్ నర్స్ లు కావాలని ఎమ్మెల్యే దృష్టికి తెలియజేశారు.మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రము మెయిన్ గేటు దగ్గర వర్షం పడినప్పుడల్లా రోడ్డుపైన ఉన్న మట్టి మొత్తము ఆరోగ్య కేంద్రంలోకి కొట్టుకొని వస్తుందని డాక్టర్ స్రవంతి గారు తెలియజేశారు.అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కాంపౌండ్ బయట ఒక మీటింగ్ హాలు కట్టించారు.దానికి



కాంపౌండ్ వాళ్ళు కావాలని ఎమ్మెల్యే కి డాక్టర్ స్రవంతి తెలియజేశారు. అప్పుడు ఎమ్మెల్యే శంకర్ మీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నకు ఏమేమి కావాలో అన్ని కూడా ఒక లెటర్ ద్వారా రాసి ఇవ్వమని డాక్టర్ స్రవంతి కి తెలియజేశారు.మీ పిహెచ్సి కి కావాల్సిన వసతులు ఏమి కావాలో లెటర్ రూపకంగా ఇస్తే వాటిని పరిశీలించి వెంటనే పనులు చేయిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ స్రవంతి కి హామీ ఇచ్చారు. ఇందుకుగాను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



సిబ్బంది ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పి హెచ్ సి హెల్త్ ఎడ్యుకేటర్ జే.శ్రీనివాసులు,హెల్త్ సూపర్వైజర్లు శ్రీరామ,చంద్రకళ , ల్యాబ్ టెక్నీషియన్ అశోక్, ఏఎన్ఎంలు మరియు ఆశలు, చించోడు సర్పంచ్ శ్రీనివాస్, డిప్యూటీ సర్పంచ్ రాజేందర్ రెడ్డి,చెవులపల్లి సర్పంచ్ జంగయ్య,మరియు గిరిధర్, అంజయ్య, రవీందర్, ఉమామహేశ్వర్, గోపాల్ నాయక్,రాజు,సంతోష్, జంగయ్య,రంగయ్య సూర్యప్రసాద్,ఎండి గౌస్కొ మొదలగు వారు పాల్గొన్నారు.

# షాద్ నగర్ మీడియా శిఖరం.. షెహన్ షా ఖాజా పాషా జన్మదిన వేడుకలు..

## ఘనంగా అక్షర యోధుడు అవిశ్రాంత శ్రామికుడు..

## ఖాజాపాషా (కేపీ)పుట్టినరోజు వేడుక.. -జర్నలిస్టుల బృందం ఆధ్వర్యంలో సంబరాలు..

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
నియోజకవర్గం వ్యాప్తంగా పత్రిక రంగం లో తనకంటూ ఓ ప్రత్యేక ఒరవడి సృష్టించుకొని పత్రిక రంగాన్ని ఆయన ఆశయ సాధనలో భాగంగా షాద్ నగర్ మీడియా సామ్రాజ్యంలో మకుటం లేని మహారాజుగా పత్రిక రంగంలో రాజకీయ నాయకులకు ఖాజా పాషా కేపీ గా యువతకు యూత్ ఖాజా భయ్యగా మీడియా రంగం లోని జర్నలిస్ట్ సంఘం లో జిల్లా అదేవిదంగా రాష్ట్ర స్థాయి లో తాను అధిరోహించిన పదవులకు వన్నె తెస్తూ నూతనంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గా బాధ్యతలు స్వీకరించడం శుభ పరిణామం అని కొనియాడుతూ నేడు పుట్టినరోజు జరుపుకోవడం తన ఆత్మీయ మిత్రులు సోదరులు ఆయన అభిమానులు మర్చిపోలేని రోజుగా కీర్తిస్తూ మీడియా రంగంలో ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరుకుంటూ జన్మదిన సంబరం అంబరాన్ని తాకేల ఘనంగా సన్మానించి సంబరాలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నో సేవలు చేశానని రాబోయే రోజుల్లో




మరిన్ని సేవలతో సమాజ శ్రేయస్సు కు పాటు పడతానని ఎన్ని ఆటాంకలు ఆవరోదాలు వచ్చిన వెనుదిరిగి చూసే ప్రసక్తే లేదని తనను నమ్ముకున్న వారికీ అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.తనపై ఇంత అభిమానం చూపుతూ జన్మదిన వేడుక నిర్వహించడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికి పేరు పేరున కృతజ్ఞతలు తెలియజేశారు.

# ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ బీజేపీ

## తెలంగాణలో అధికారమే లక్ష్యం-నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి

## అంత్యోదయంతో ప్రజల సంక్షేమమే మోదీ ప్రభుత్వ ధ్యేయం: అందె బాబయ్య





**షాద్‌నగర్, (ప్రజావినికిడి):**
భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని షాద్‌నగర్ పట్టణంలోని పలు వార్డుల్లో నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమాల్లో బీజేపీ రాష్ట్ర నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి,అందె బాబయ్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా 6వ వార్డులో వెంకటేష్ నాయక్ ఆధ్వర్యంలో, 7వ వార్డులో భాస్కర్ పటేల్ మరియు నందు ఆధ్వర్యంలో జనంపేటలో, 27వ వార్డు తిరుమల కాలనీలో మంగ విజయ్ ఆధ్వర్యంలో,9వ వార్డులో కౌన్సిలర్ ప్యాట అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొని భరతమాతకు,జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ,పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయకు పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ “దేశమే ప్రథమం” అనే సిద్ధాంతంతో ముందుకు సాగుతున్న బీజేపీ ప్రపంచంలోనే అతి పెద్ద రాజకీయ పార్టీగా అవతరించిందన్నారు.1980లో స్థాపితమైన ఈ పార్టీ నేడు 18 కోట్లకు పైగా సభ్యత్వంతో దేశవ్యాప్తంగా బలమైన సంఘటిత నిర్మాణాన్ని కలిగి ఉందని తెలిపారు. పోలింగ్ బూత్ స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు కార్యకర్తల సమష్టి కృషితో 2 ఎంపీ సీట్ల నుండి ప్రారంభమైన పార్టీ ప్రస్తుతం 20కి పైగా రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఏర్పాటు చేసి, కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో మూడోసారి అధికారంలో కొనసాగుతోందని వివరించారు.బీజేపీ కార్యకర్తలను నాయకులుగా తీర్చిదిద్దే ప్రత్యేకత కలిగిన పార్టీ అని,ప్రజాస్వామ్య విధానంలో బూత్ స్థాయి నుండి ఎదిగిన నాయకులే ఉన్నత స్థానాలకు చేరుకుంటారని అన్నారు.శ్రీ అటల్ బిహారీ వాజపేయి వంటి మహానేతల నుండి ప్రస్తుత జాతీయ అధ్యక్షుడు శ్రీ నితిన్ నబీ వరకు ఇదే సంప్రదాయం కొనసాగుతోందని తెలిపారు. తెలంగాణలో కూడా పార్టీ కార్యకర్తల శక్తి,ప్రజా సమస్యలపై పోరాటం ద్వారా అవినీతి,కుటుంబ రాజకీయాలకు ప్రత్యామ్నాయంగా బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు.అందె బాబయ్య మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం “అంత్యోదయ” స్ఫూర్తితో పేదల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని అనేక అభివృద్ధి,సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు.ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన ద్వారా గృహ నిర్మాణం,ఉజ్వల యోజన ద్వారా ఉచిత గ్యాస్ కనెక్షన్లు, ఆయుష్మాన్ భారత్ ద్వారా ఆరోగ్య భద్రత,పీఎం కిసాన్ ద్వారా రైతులకు ఆర్థిక సహాయం, హర్ ఘర్ జల్ ద్వారా తాగునీటి సరఫరా వంటి పథకాలు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచాయని తెలిపారు. మోదీ ప్రభుత్వం పేదల అభ్యున్నతికి కట్టుబడి పనిచేస్తోందని కొనియాడారు.ఈ కార్యక్రమంలో 9వ వార్డు కౌన్సిలర్ ప్యాట అశోక్,ఉప సర్పంచ్ గంగాధర్,ఇస్నాతి శ్రీనివాస్,వంశీకృష్ణ,మాల్చలం మురళి,శ్రీనివాస్ చారి,చెట్ల వెంకటేష్,సిరిపురి రమణ, వెంకటేష్ నాయక్,మంగ విజయ్,మంగ వెంకటేష్,భాస్కర్ పటేల్,శక్తి కేంద్రం ఇంచార్జ్ మాల్చలం రాము,వెంకటేష్, అల్లం అనిల్ గౌడ్,కొంకల్ల మణికంఠ,నక్కల మల్లేష్, ఆనగంటి నందు,గజ్జల ప్రవీణ్,పల్లె కార్తిక్,ఆగోత్ సూర్య నాయక్,సాయికుమార్, రవికుమార్,జంబుల నరసింహ, రాజేశ్వరి,సతీష్ తదితర భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

# ఘణంగా భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుక



**వాజేడు,ఏప్రిల్ 7,(ప్రజావినికిడి):**
మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ (బిజెపి) పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పార్టీ మండల నాయకులు జెండా ఎగరవేసి సంబరాలు చేసుకున్నారు.



మండల ప్రెసిడెంట్ పెద్ది జగపతి బాబు మాట్లాడుతూ ప్రపంచంలో అతిపెద్ద రాజకీయ పార్టీగా బిజెపి రూపుదిద్దుకోవడం చాలా సంతోషకరము అని అని అన్నారు. కార్యకర్తలు అందరు సమిష్టిగా పనిచేస్తే రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు.ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు కందుల రామ్ కిషోర్, సీనియర్ నాయకులు సాగి సీతారామరాజు, సంద్ర సోమరాజు, యాలం సుబ్బయ్య, ఎడ్జర్లపల్లి సర్పంచ్ అట్టం మమత, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోలన్ హన్మంత్ రెడ్డి



**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):**
మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు అలాగే కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా హరివర్ధన్ రెడ్డి ని శాలువాతో ఘనంగా సత్కరించి,వారి దీర్ఘాయుష్షు, ఆరోగ్యం,అలాగే రాజకీయ జీవితంలో మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి,కోసం నిరంతర కృషి చేసే మంచి వ్యక్తిత్వం ప్రజాసేవ పట్ల హరివర్ధన్ రెడ్డి సేవలు చిరస్మరణీయమైనవని ఆయనను ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి జన్మదిన సందర్భంగా ఎల్ఈడి టీవీ బహుకరణ

## ఎల్ఈడి టీవీ ని బహుకరించిన మహాదేవ్ పూర్ సర్పంచ్ అనూష రవీందర్ రెడ్డి




**షాద్ నగర్, (ప్రజావినికిడి):** విద్యార్థుల అభివృద్ధి సమాజం అభివృద్ధి అనే ఒక చిన్న సంకల్పంతో తమ ప్రియతమ నాయకుడు ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి జన్మదిన సందర్భంగా షాద్ నగర్ నియోజకవర్గం కొందుర్గు మండలంలోని మహాదేవ్ పూర్ సర్పంచ్ అనూష రవీందర్ రెడ్డి కొందుర్గు మండలం గంగన్నగూడెం గ్రామంలోని పేద విద్యార్థులకు ఎల్ఈడి టీవీ ని బహుమతిగా ఇచ్చారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, గ్రామస్తులు నాయకుడు అనూష రవీందర్ రెడ్డిని సన్మానించి సత్కరించారు. ఈ చిన్న సహాయం విద్యార్థులకు ఒక పెద్ద వెలుగులా పని చేయాలని,ప్రస్తుత ఆధునిక విద్యలో విద్యార్థులు ఆధునిక పరిజ్ఞానం పొందాలంటే వర్ పూర్తిగా టెక్నాలజీని ఉపయోగించుకుని చదువుకున్నప్పుడే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని,ఎల్ఈడి టీవీ ద్వారా విద్యార్థులు ఆన్లైన్లో చూసి పాఠాలు నేర్చుకుని మరింత విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అనూష రవీందర్ రెడ్డి అభిప్రాయపడ్డారు.పేద విద్యార్థుల సమస్యలను అర్థం చేసుకొని వారికి అండగా నిలబడే నాయకులు సమాజానికి నిజమైన ఆదర్శమని,విద్యార్థుల భవిష్యత్తు బాగుండాలని ఆశిస్తూ,వారి చదువుకు సహాయం చేసిన ఈ మంచి కార్యక్రమం అందరికీ ప్రేరణగా నిలవాలని కోరుకుంటూ,పేద విద్యార్థుల కోరిక మేరకు ఎల్ఈడి టీవీ అందజేసి వారి విద్యాభివృద్ధికి తోడ్పడుతున్న యువ నాయకునికి ఉపాధ్యాయ బృందం గ్రామస్తులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

# ప్రజారోగ్యంపై వాకథాన్


## జెండా ఊపిన మంత్రి దామోదర

**హైదరాబాద్ ఏప్రిల్ 6 (ప్రజావినికిడి):**
శారీరకంగా ఆరోగ్యంగా ఉంటేనే మానసికంగా దృఢంగా ఉండగలమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం ఆరోగ్య వారోత్సవాలను నిర్వహిస్తోంది. ఈ మేరకు పీవీ మార్గ్ జలవిహార్ నుంచి హెచ్ఎండీఏ గ్రౌండ్స్ వరకు ఏర్పాటు చేసిన వాకథాన్‌ను మంత్రి జెండా ఊపి




ప్రారంభించారు. వాకథాన్‌లో పాల్గొన్న వారితో కలిసి మంత్రి జలవిహార్ నుంచి హెచ్ఎండీఏ గ్రౌండ్స్ వరకు నడిచారు. కార్యక్రమంలో హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన, హెల్త్ సెక్రటరీ క్రిస్టినా, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు తమ జీవితంలో వ్యాయామాన్ని భాగంగా చేసుకోవాలని సూచించారు. ఈ వారం రోజుల పాటు ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నట్టు వివరించారు.

# దొంగతనం కేసులో పాత నేరస్తుడి అరెస్ట్..





**నాగోల్,(ప్రజావినికిడి):** నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇంట్లో చొరబడి నగలు,విలువైన వస్తువులు దొంగిలించిన ఓ పాత నేరస్తుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ మహమ్మద్ మక్బూల్ జానీ వెల్లడించిన వివరాల ప్రకారంఈ నెల 4వ తేదీ అర్ధరాత్రి సాయి నగర్ లలిత నగర్ కు చెందిన కొమ్మెర నవీన్ (20) అని యువకుడు నాగోల్‌లోని ఎకోపాలిట్ అపార్ట్‌మెంట్ నాల్గవ బ్లాక్,ఐదవ అంతస్తులో నివసిస్తున్న రమాకాంత్ కౌశిక్ ఇంట్లోకి కిటికీ గ్రిల్ తొలగించి చొరబడ్డాడు. కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న సమయంలో మరో బెడ్‌రూమ్‌లోని కబోర్డ్‌లో ఉన్న రమాకాంత్ కౌశిక్ తల్లికి చెందిన సుమారు పదిన్నర తులాల బంగారు నగలు ఒక నెక్లెస్, రెండు లాంగ్ చైన్లు, ఒక బ్లాక్ బీడ్స్ చైన్,గాజులు, ఉంగరాల తో పాటు హెచ్ ల్యాప్‌టాప్‌ను దొంగిలించాడు. అలాగే ఒక యాక్టీవా బైక్‌ను కూడా అపహరించినట్లు తెలిపారు.

బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీటీవీ ఫుటేజీలను వివిధ కోణాల్లో పరిశీలించి నిందితుడిని గుర్తించారు. అనంతరం అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నాడు. దొంగిలించిన నగలు, ల్యాప్‌టాప్, యాక్టీవా బైక్‌ను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడిపై నాగోల్, హయత్‌నగర్, సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్లలో గతంలో కూడా కేసులు ఉన్నాయని, ఇటీవలే జైలు నుంచి విడుదలై మళ్లీ దొంగతనానికి పాల్పడినట్లు సీఐ తెలిపారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన డీఐ రుద్వీర్,డీఎస్ఐ నరసింహ, కానిస్టేబుళ్లు సుభాష్,సాయిష్, క్రైమ్ రైటర్ మౌనికలను సీఐ అభినందించారు.

# నాగోల్ సహ భావన టౌన్షిప్ లో ఘనంగా హిందూ సమ్మేళన కార్యక్రమం






**నాగోల్, (ప్రజావినికిడి)** నాగోల్ సహ భావన టౌన్షిప్ లోని సబ్ స్టేషన్ గ్రౌండ్ లో సహభావన సమాలోచన ఏ. బి.సి.డి బ్లాక్ ల కమిటీ ఆధ్వర్యంలో ఆర్ఎస్ఎస్ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా హిందూ సమ్మేళనం ఎంతో కనుల పండుగ నిర్వహించారు. ఈ సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ ఆధ్యాత్మిక ప్రసంగికులు డాక్టర్ అనంత లక్ష్మి , సికింద్రాబాద్ ఇస్కాన్ ప్రెసిడెంట్ ఐసిసి ఇస్కాన్ చైర్మన్ డాక్టర్ సహదేవ దాస్, మాతృశ్రీ ఆర్గనైజేషన్ ఫౌండర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హార్ట్ ఫుల్ నెస్ స్కిల్ డెవలప్మెంట్ అరవింద్ కపట్కర్ పాల్గొని హిందూ సమ్మేళనంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ మొన్న ఉగాది తేదీనాడు అంటే 18 రోజులు ఈ కార్యక్రమాన్ని ఎంతో భక్తి శ్రద్ధలతో నగర సంకీర్తనలు, లలితా సహస్ర పారాయణం, భజనలు, హనుమాన్ చాలీసా పారాయణం పిల్లల్లో డిజిటల్ వైపు కాకుండా ఆధ్యాత్మికతపై దృష్టి మళ్లించడానికి అలాగే హిందూ మత గొప్పదనాన్ని విస్తరించే విధంగా ఇక్కడ నిర్వహించినట్లు తెలిపారు. ప్రతిరోజు 300 మందికి పైగా కాలనీవాసులు, భక్తులు పాల్గొన్నారని అన్నారు. 18వ రోజు ఆదివారం నాడు ముగింపు సందర్భంగా హిందూ సమ్మేళన కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఇందులో దాదాపుగా 1,400 మందికి పైగా పాల్గొన్నట్లు పేర్కొన్నారు. ఇందులో పాల్గొన్న ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. సహకరించిన కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు సొంటి శివకుమార్, ట్రెజరర్ ఉప్పల నాగేష్,సెక్రటరీ చిన్నప్పరెడ్డి, కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు కళ్యాణ్ చక్రవర్తి,భాస్కర్, సుగుణాకర్, నగేష్,ముఖేష్, నాగేందర్, మునేందర్, తుకారం ఇతర సభ్యులు, అపార్ట్మెంట్ వాసులు,భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అక్షర వేగం పెరిగినప్పుడే.. సమాజ క్షేమం ఎదుగుతుంది..

**షాద్ నగర్ న్యూస్ ఎక్స్ ప్రెస్ గ్రూప్ ను ప్రారంభించిన జర్నలిస్టు ఖాజా పాషా (కేపీ)..**

**నిర్వాహకుడు బూర్గుల రమేష్ కు అభినందనలు.. -ప్రజల మధ్యనే ఉండండి..వారి సమస్యలు వినండి: కేపి**

**షాద్ నగర్,(ప్రజావినికిడి):** జర్నలిజం అంటే నాయకుల అడుగులకు మడుగులు వత్తడం కాదు.. నిజమైన జర్నలిస్టు ఎప్పుడు ప్రజల మధ్యనే ఉండాలి.. వారి క్షేమమే పాత్రికేయుడు లక్ష్యం కావాలి.. జర్నలిస్టు కేపీ అన్నారు. జర్నలిస్ట్ బుర్గుల రమేష్ నూతనంగా ప్రారంభించిన న్యూస్ ఎక్స్ ప్రెస్ గ్రూపును సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సమాజంలో ప్రజల కష్టాలను ప్రభుత్వాల దృష్టికి తీసుకువచ్చి వాటిని పరిష్కరించడమే నిజమైన జర్నలిజమని ఆయన అన్నారు. అలా ప్రజలకు అంకితమై పని చేసినప్పుడే జర్నలిస్టు గుర్తింపు పొందుతాడని వెల్లడించారు. ఈ దిశగా వర్తమాన జర్నలిస్టులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఇంతకుముందు వాళ్ళు పత్రికలు,చానళ్లల్లో పనిచేసి ఎంతో గుర్తింపు పొందిన జర్నలిస్టు బూర్గుల రమేష్ మరో కొత్త అడుగు వేయడం ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి ముందడుగు పడుతుందని ఆశిస్తున్నట్లు వెల్లడించారు. ఎలాంటి ఆదాయం లేకపోయినా ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ముందుకు సాగడమే జర్నలిస్టులకు ఉన్న లక్ష్యమని,అలాంటి లక్షణాలు నూటికి నూరు శాతం బూర్గుల రమేష్ లో ఉన్నాయని ఆయన ప్రశంసించారు. న్యూస్ ఎక్స్ ప్రెస్ ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తూ మంచి గుర్తింపు పొందాలని ఆకాంక్షిస్తున్నట్లు వెల్లడించారు.



# ఘనంగా ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు

## లబ్ధిదారులకు బట్టల పంపిణీ

**షాద్ నగర్,(ప్రజా వినికిడి):** షాద్ నగర్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని, రాజకీయాలకు అతీతంగా అందరం కలిసిమెలిసి గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన మండల పరిధిలోని భీమారం,ఉప్పరిగడ్డ,చించొడ్ గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా సుమారు కోట్లాది రూపాయల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు.

## మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి

గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే,ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పలు కీలక పనులను ప్రారంభించారు.

భీమారం, ఉప్పరిగడ్డ, గ్రామాల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ,సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అదేవిధంగా చించొడ్ గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. అంతకుముందు చించొడ్ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అదనపు గదుల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాణ్యతతో కూడిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

## సొంతింటి లబ్ధిదారుల ఇంట సంబరాలు



భీమారం,చించోడు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారులు సోమవారం రోజు సామూహిక గృహప్రవేశాలు నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లబ్ధిదారుల కుటుంబ సభ్యులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన,వారికి నూతన వస్త్రాలను బహూకరించి శుభాకాంక్షలు తెలిపారు. పేదవాడి సొంతింటి కల నెరవేరుతుంటే చూడటం ఎంతో సంతోషంగా ఉందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

## ఉప్పరిగడ్డలో జనసంద్రం సర్పంచ్ ప్రశంసలు

ఉప్పరిగడ్డ గ్రామంలో సర్పంచ్ చందునాయక్ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభను నిర్వహించారు. ఈ సభకు అయ్యవారిపల్లి,

మక్త,జయరాం తండా గ్రామాల నుండి ప్రజలు,మహిళలు,యువకులు పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సర్పంచ్ చందునాయక్ మాట్లాడుతూ.. "వీర్లపల్లి శంకర్ నాయకత్వంలో నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనలో ఆయన



చూపిస్తున్న చొరవ అభినందనీయమన్నారు. ఆయనతోనే మన గ్రామాల అభివృద్ధి సాధ్యం"అని స్పష్టం చేశారు. ముఖ్యంగా తమ గ్రామానికి ఎమ్మెల్యే 30 లక్షల సిసి రోడ్లు నిర్మాణాల పనులు,అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణానికి మరో 20 లక్షల రూపాయల నిధులు కేటాయించడం చాలా సంతోషంగా ఉందన్నారు. అదేవిధంగా గ్రామంలో 18 ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తున్నామని, మరో 20 ఇల్లు మంజూరు చేయడానికి ఎమ్మెల్యే హామీ ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని,తద్వారా పేద ప్రజల ఆకాంక్ష నెరవేరుతుందన్నారు. ఇలాంటి ఎమ్మెల్యే మన నియోజకవర్గానికి ఉండడం అభినందనీయమన్నారు. ఈ పర్యటనలో ఫరక్ నగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి,అయ్యవారిపల్లి గోపాల్ నాయక్,చించోడు సర్పంచ్ శ్రీనివాస్,చౌలపల్లి సర్పంచ్ జంగయ్య,ఉప్పరిగడ్డ డిప్యూటీ సర్పంచ్ శ్రీలత తిరుపతయ్య, కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండల వైస్ ప్రెసిడెంట్ గజేంద్ర నాయక్,బి. తిరుపతయ్య, భోజ్య నాయక్, ప్రజాప్రతినిధులు,మండల స్థాయి అధికారులు,పార్టీ సీనియర్ నాయకులు,యువజన విభాగం ప్రతినిధులు,పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

# నాగోల్ చెరువును పరిశీలించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి..





**నాగోల్,(ప్రజావినికిడి):** ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్లలో దోమలు విపరీతంగా పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ,

పలు అనారోగ్య సమస్యల బారిన పడుతున్న నేపథ్యంలో ప్రజల పక్షాన నేనున్నానని మన ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి దోమలపై యుద్ధం కార్యక్రమాన్ని చేపట్టిన నేపథ్యంలో సోమవారం ఉదయం ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి స్థానిక భారస నాయకులచే కలిసి నాగోల్ చెరువును పరిశీలించడం జరిగింది. ఈ చెరువులో గతంలో పేరుకుపోయిన గుర్రపుడెక్క ఆకును పూర్తి స్థాయిలో తొలగించడం జరిగింది. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి కి చుట్టుపక్కల కాలనీవాసులు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం సుధీర్ రెడ్డి

మాట్లాడుతూ, మార్చి 13వ తేదీన నియోజకవర్గ పరిధిలోని మాన్సూరాబాద్ డివిజన్‌లోని పెద్ద చెరువు,హయత్‌నగర్ డివిజన్‌లోని కుమ్మరికుంట చెరువు,నాగోల్ చెరువుల్లో పేరుకుపోయిన గుఱ్ఱపుడెక్క ఆకును పరిశీలించడం జరిగింది అని అక్కడ ఉన్న వాకర్లు ఇక్కడికి వాకింగ్‌కు రావాలంటే దోమల వల్ల ఎక్కడ విషజ్వరాలు వస్తాయో అని భయపడుతున్నామని తెలిపారు. దోమల ప్రభావం వల్ల చాలామంది ఉదయం అలాగే సాయంత్రం పూట వాకింగ్‌కు రావడానికి జంకుతున్నారని చెప్పారు. అలాగే ఇళ్లలో ఉన్న చిన్నా పెద్దలు రోగాల బారిన పడుతున్నామని వాపోయారు. వెంటనే సుధీర్ రెడ్డి అధికారులచే మాట్లాడి చెరువుల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క ఆకును తొలగించి దోమల నుండి ప్రజలకు విముక్తి కలిగించాలని కోరిన నేపథ్యంలో పనులు ప్రారంభం చేయడం జరిగింది అని తెలిపారు. గత భారస ప్రభుత్వంలో ప్రజా సమస్యలపై చిత్తశుద్ధితో,

ముందుచూపుతో ఆలోచించి నియోజకవర్గ పరిధిలోని చెరువుల్లో గుఱ్ఱపుడెక్క ఆకు పేరుకుపోకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. కాలనీవాసుల సౌలభ్యం కోసం దోమల నివారణకు డ్రోన్ల సహాయంతో ప్రయోగాత్మక పరీక్షలు నిర్వహించి సఫలీకృతం చేశామని చెప్పారు. అలాగే చెరువుల్లో దోమల వల్ల ఉత్పన్నమయ్యే లార్వాను అరికట్టడానికి వందలాది గంబూజియా జాతికి చెందిన చేప పిల్లలను వదిలి లార్వాను నిర్మూలించామని తెలిపారు. డ్రోన్ పరిజ్ఞానం ద్వారా చెరువు మధ్యలోకి వెళ్లలేని ప్రాంతాల్లో కూడా మందులు పిచికారీ చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఇప్పటికయిన ఈ ప్రభుత్వం ప్రజా ఆరోగ్య సమస్యలపై మరింత దృష్టి సారించాలని కోరారు. అలాగే కాలనీలలో ఫాగింగ్ లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో నా పిలుపుతో పలువురు భారస నాయకులు తమ సొంత నిధులతో ఫాగింగ్ యంత్రాలను కొనుగోలు చేసి స్ప్రే చేయిస్తున్నారు.

ఇప్పటికీ రాత్రిపూట నిరవధికంగా ఫాగింగ్ కొనసాగుతోంది. కావున ప్రభుత్వం కూడా మరిన్ని ఫాగింగ్ యంత్రాలు కొనుగోలు చేసి దోమల బెడద నుంచి ప్రజలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ భారస నాయకులు ఆనంతుల రాజారెడ్డి,డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు చిరంజీవి,చెరుకు ప్రశాంత్ గౌడ్,సీతారాములుపోచంపల్లి రాజేందర్ రెడ్డి,గుత్తా భాస్కర్ రెడ్డి,మురళి బస్తివాసులు తదితరులు పాల్గొన్నారు.

# వారణాసిలో సేవలు.. కాశీనాథుడికి అభిషేకాలు..

**షాద్ నగర్ జర్నలిస్ట్ కేపీ అభిమాని కోలాహలం.. - జన్మదినం రోజున పవిత్ర కాశీలో సేవలు..**

**కేపీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన చిన్నారులు..**

**షాద్ నగర్,(ప్రజావినికిడి):** తాను సినిమా స్టార్ కాదు.. రాజకీయ నాయకుడు కాదు.. కానీ ఎక్కడో ఉన్న ఒక రాష్ట్రంలో అతని పేరు మీద సేవలు..అతని పేరిట దైవానికి అభిషేకాలు.. ఒక జర్నలిస్టు ఇంతటి ఆదరణ లభించడం సామాన్యమైన విషయం కాదు. కానీ అలాంటి అరుదైన అభిమానాన్ని అందుకున్నాడు జర్నలిస్టు కేపీ. తన కళా ప్రతిభ ద్వారా సామాజిక మాధ్యమాలలో చురుకుగా ఉండడం, సంచలనమైన వార్తల ద్వారా వార్తల్లో ఉండడం, వివిధ సేవా కార్యక్రమాల ద్వారా జనం మధ్య ఉండడంతో స్వరాష్ట్రంలోనే కాక ఇతర రాష్ట్రాలలోనూ కేపీ తన అభిమాన గుణాన్ని పెంచుకున్నారు. ఇందులో భాగంగా వారణాసిలో ఉండే అభిమానులు కేపీకి సర్ప్రైజ్ ఇచ్చారు. సోమవారం అతని జన్మదినాన్ని పురస్కరించుకొని అనాథ పిల్లలకు సేవలు చేశారు. వారి చేత కేక్ కట్ చేయించి కేపీ జన్మదినాన్ని నిర్వహించారు. అంతేకాకుండా కేపీ పేరిట కాశీనాథుడికి అభిషేకం చేశారు. చిన్నారి నిరుపేదలకు ఆహారం అందించారు. దీనిపై జర్నలిస్ట్ కేపీ స్పందిస్తూ ఇంతటి అభిమానులను, వారి ఆదరణను సంపాదించుకోగలిగినందుకు గర్వంగా ఉందని అన్నారు. ఈ అభిమానమే తనకు శ్రీరామరక్షగా భావిస్తున్నానని వెల్లడించారు. భవిష్యత్తులను తన కళలు,తన కలం,తన సేవలు జనాలకు ఉపయోగపడేలా మరింత ఉత్సాహంగా ముందుకు సాగుతానని స్పష్టం చేశారు. తన జన్మదిన వేడుకలు నిర్వహించి తనపై ఉన్న అభిమానాన్ని చాటుతున్న అభిమానులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



# గట్స్ ఉన్న జర్నలిస్టు..
# మనసున్న నా మిత్రుడు కేపీ..

### షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..
### సీనియర్ జర్నలిస్టు కేపీ జన్మదిన వేడుకల కార్యక్రమం
### శ్రీ సరస్వతి కళాపీఠం సభ్యులను సన్మానించిన ఎమ్మెల్యే శంకర్






**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
మంచి జర్నలిస్టుగా మాత్రమే కాకుండా మనసున్న వ్యక్తిగా, స్నేహితుడిగా కూడా జర్నలిస్ట్ కెపితో తనకు ఎంతో అనుబంధం ఉందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కేపి దంపతుల జన్మదినోత్సవ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుగా నిరంతరం సమాజంతో పోరాడే కేపీ లాంటి వ్యక్తులు అవసరమని అన్నారు.వైద్య శాఖలో ఉండి నిరుపేదలకు సేవలు అందిస్తున్న ఆయన సతీమణి శ్యామల పాత్ర కూడా ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఇంత చక్కటి కార్యక్రమానికి తనను ఆహ్వానించినందుకు ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాలకు తన సహకారం ఎప్పుడూ ఉంటుందని అన్నారు. చక్కని పాటలతో కనువిందు చేస్తున్న శ్రీ సరస్వతి కళా పీఠం నిర్వాహకులను ఆయన మనస్ఫూర్తిగా అభినందించారు. జర్నలిస్ట్ కేపీతో తన రాజకీయ ప్రయాణం విజయవంతంగా కొనసాగిందని, ఇలాంటి వారితో సఖ్యతగా స్నేహంగా ఉండడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా శ్రీ సరస్వతి కళా పీఠం సభ్యులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ కళాకారులను ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో కళాకారుల కోసం మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు.వీరి వెంట మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి తో పాటు మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

# కేశంపేటలో ఘనంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు

## ప్రభుత్వ ఆసుపత్రిలో బెడ్లు, పండ్లు పంపిణీ

### కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెపిన కేశంపేట్ మండల సర్పంచులు,మాజీ ప్రజా ప్రతినిధులు బిఆర్ఎస్ నాయకులు





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
నిరంతరం ప్రజల్లో ఉండే నాయకుడు ఎమ్మెల్సీ నవీన్ అన్న పుట్టినరోజు సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు,పండ్లు పంపిణీ చేసి కేశంపేట్ మండల కేంద్రంలో బిఆర్ఎస్ సర్పంచులు,మాజీ సర్పంచులు,మాజీ ఎంపీటీసీలు,బిఆర్ఎస్ నాయకులు కలిసి కేక్ కట్ చేసి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నవీన్ అన్న నిత్యం ప్రజల్లో ఉండే నాయకుడుగా పేరు సంపాదించుకున్నాడని అనునిత్యం ప్రజా సమస్యలపై పోరాడే నాయకుడని,నవీన్ అన్న బిఆర్ఎస్ అభివృద్ధికి నాయకుల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తాడని వారు అన్నారు.ఈ వేడుకలలోలింగంధన సర్పంచ్ నాగిళ్ల వెంకటేష్,పోమాల్ పల్లి సర్పంచ్ స్వప్న భూపాల్ రెడ్డి,తూర్పుగడ్డ సర్పంచ్ తౌర్య నాయక్, భైరాఖాన్ పల్లి సర్పంచ్ తనయుడు శివ యాదవ్,మాజీ సర్పంచ్ లు తలసాని వెంకట్ రెడ్డి,యారం శేఖర్ రెడ్డి,తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి,ఆంజనేయులు యాదవ్,ప్రభాకర్ రెడ్డి,రాములు, కృష్ణయ్య,పాపిరెడ్డి గూడ డిప్యూటీ సర్పంచ్ తాండ్ర జ్యోతి నరేందర్ రెడ్డి,లెమామిడి డిప్యూటీ సర్పంచ్ ప్రమోద్ రెడ్డి,కొత్తపేట డిప్యూటీ సర్పంచ్ దర్శన్,ఇప్పల పల్లి సురమోని పద్మ సహదేవ్,మాజీ ఉపసర్పంచ్ దశరథం మాజీ ఎంపీటీసీలు యాదయ్య, రాంచందర్ నాయక్,బి ఆర్ ఎస్ నాయకులు జగన్ రెడ్డి,రామ్ రెడ్డి, పల్లాటి కృష్ణయ్య,నాగరాజు నరేందర్.జి, అబ్బి శ్రీను, మ్యాదరి ప్రవీణ్,చిన్న నాయక్,సురమోని శంకర్,చాకలి హన్మయ్య,పల్లాటి శీనయ్య,తాండ్ర క్రిష్ణ రెడ్డి,గూడా శేఖరయ్య, అల్వాల రాజు, నాగుల్ కృష్ణ, అబ్బి రవి,మ్యాదారి కుమార్, గొల్ల ఆంజనేయులు యాదవ్, లెంకపోతుల మనిగౌడ్,అబ్బి వీరేష్, శ్రీకాంత్,జర్పుల సురేష్,బేరి నవీన్, బేరి యాదయ్య, గడ్డమీది శ్రీనివాస్, అబ్బి యాదయ్య,కొత్తపేట లక్పయ్య,కృష్ణకేశంపేట మురళి,తలసాని ప్రవీణ్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# షాద్ నగర్ లో గబ్బర్ సింగ్ టీమ్ అదరగొట్టారు..

### జర్నలిస్ట్ కెపి,శ్యామల దంపతుల జన్మదినోత్సవంలో గబ్బర్ సింగ్ టీం..
### అంతాక్షరితో అలరించిన కళాకారులు.. - ఖల్ నాయక్ పాటపై చిందులేసిన గబ్బర్ సింగ్ టీం







**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
గబ్బర్ సింగ్ టీం గుర్తుందా..? వారిని ఎవరు మర్చిపోరు.. అంతరిక్షరి సన్నివేశాన్ని ఇప్పటికీ గుర్తుంచుకుంటారుగబ్బర్ సింగ్ సినిమాలో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తో ఆ కళాకారులంతా పట్టణంలోని కంట్రీ సైడ్ క్లబ్ కు తరలివచ్చి వీక్షకులను ఆనందంలో ముంచెత్తారు. జర్నలిస్ట్ కేపీ, శ్యామల జన్మదినోత్సవంలో ఈ వేడుక చోటు చేసుకుంది. జర్నలిస్ట్ కేపీ పై అభిమానంతో తరలివచ్చిన అతని మిత్రులు గబ్బర్ సింగ్ టీం రమేష్,రెంసన్ రాజ్,సాయి, ప్రవీణ్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రేక్షకుల కోరిక మేరకు గబ్బర్ సింగ్ సినిమాలోని జబర్దస్త్ అంతాక్షరి సన్నివేశాన్ని పునరావృతం చేసి అందరి చేత కరతాళ ధ్వనులు చేయించుకున్నారుకేపీ తనకు ఎంతో ఆత్మీయ మిత్రుడని, ఇలాంటి ఒక గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన తమ మిత్రుడిని అభినందించే నిమిత్తం ఈ కార్యక్రమానికి రావడం జరిగిందని తెలిపారు.కెపి ఎక్కడ ఉన్న తమ హృదయాల్లో ఉంటారని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. గతంలో కూడా కేపీ కి సంబంధించిన అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నామని గుర్తు చేశారు. ఇలాంటి మంచి కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ ఆస్వాదించాలని కోరారు. అంతాక్షరిలో పాడిన పాటలను వారు పాడి అలరించడంతో జనం చప్పట్లు కొట్టారు. ఈ సందర్భంగా కేపీ దంపతులను వారు ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. జర్నలిస్ట్ కేపీతో కల్ నాయక్ పాటపై ఆడుతూ పాడుతూ కార్యక్రమాన్ని రక్తి కట్టించారు.

# జర్నలిస్ట్ కేపీ లాంటి వ్యక్తులు చాలా అరుదు..

### షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి
### జర్నలిస్టు కుటుంబంతో ప్రత్యేక అనుబంధం




**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
జర్నలిస్టుగా, కళాకారుడిగా, సమాజ సేవకుడిగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఇంతింతై ఎదుగుతున్న జర్నలిస్టు కేపీ లాంటి వ్యక్తులు చాలా అరుదుగా ఉంటారని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాపరెడ్డి అన్నారు.స్థానిక సీనియర్ జర్నలిస్టు కేపీ జన్మదిన వేడుకల సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితరులతో కలిసి ఆయన కార్యక్రమానికి హాజరయ్యారు. ఒకే వ్యక్తి అనేక మార్గాలలో ప్రయాణం చేయడం ప్రశంసనీయమని, అది ఎవరి వల్ల కాదని స్పష్టం చేశారు.షాద్ నగర్ సీనియర్ జర్నలిస్ట్ కేపీ కుటుంబంతో ఎంతో అనుబంధం ఉందని, వారి తల్లిగారు తమను బిడ్డలా చూసుకునే వారని పేర్కొన్నారు.ఆమె నాకు సొంత అక్కల భావిస్తానని, చిన్ననాటి నుండి ఈ కుటుంబంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని,ఇంత మంచి కార్యక్రమాన్ని షాద్ నగర్ లో నిర్వహించడం, ఇలాంటి కార్యక్రమానికి తాను రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.కేపీ కేపి,శ్యామల దంపతులను శాలువాలతో సత్కరించిన ఆయన జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఇంత చక్కని పాటలతో ఇంత పెద్ద ఎత్తున కార్యక్రమం ఏర్పాటు చేయడం ఈ ప్రాంతంలో ఇదే ప్రథమమని ఇలాంటి గొప్ప కళాకారులను ఈ ప్రాంతానికి పరిచయం చేసిన కేపికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# జర్నలిస్ట్ కెపి నీ రూటే వేరు..

### జర్నలిస్టు కెపినీ అభినందించిన బిజెపి నాయకులు శ్రీ వర్ధన్ రెడ్డి,అందే బాబయ్య..



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
ఏది ఏమైనా జర్నలిస్టు కేపీ రూటే వేరు.. మతాలకు అతీతంగా అన్ని ఎల్ ఎస్ సాంప్రదాయాలను గౌరవించడంలో ఆయన ముందుంటారు. అంటూ బిజెపి అగ్ర నాయకులు శ్రీ వర్ధన్ రెడ్డి, అందే బాబయ్య,పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి జర్నలిస్టు కేపీని ప్రశ్నించారు. కెపి,శ్యామల దంపతులకు జన్మదిన శుభాకాంక్షలు అందజేశారు.ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర నాయకుడు శ్రీ వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, తెలుగు సంప్రదాయ కళలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తెస్తూ కళాకారులకు మంచి భవిష్యత్తును అందించే బాధ్యతను తన చేతిలోకి తీసుకున్న కె.పి అభినందనీయుడని ప్రశంసించారు. అదేవిధంగా కెపి మనవరాలు అన్షు నుదుటన కస్తూరి తిలకం.. పాట మీద అద్భుతంగా చేసిన నృత్యం చాలా బాగుందని అభినందించారు. ఈ సందర్భంగా ప్రముఖుల ముందర శ్రీరామ నీ నామమే ఎంతో రుచిరా పాటను పాడించుకుని పరవశించిపోయారు.సీనియర్ నేత అందె బాబయ్య మాట్లాడుతూ తనకు కళలంటే ఎంతో ఇష్టమని, జర్నలిస్ట్ కేపీ కళాకారుడుగా ఈరోజు ఉన్నత స్థాయిలో ఉండడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని అన్నారు.జర్నలిస్ట్ కేపీ తనకు స్వయానా ఆయన భార్య తరుపు బంధువు అని పేర్కొన్నారు. పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ తెలుగు కళలను వెలుగులోకి తెచ్చే ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ప్రశంసనీయమని అభినందించారు. చిన్నారి అన్షు నృత్యం తనను ఎంతగానో ఆకట్టుకుందని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. కార్యక్రమం ఆద్యంతం పాల్గొని గాయని గాయకులు పాడిన పాటలను వారు ఆస్వాదించడం విశేషం.మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు తో కలిసి వేదిక పంచుకున్నారు.

# జ్ఞానానికి కులమతాలతో సంబంధం లేదు..


### షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు..






**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
జర్నలిజం ద్వారా సమాజాన్ని బాగు చేయడమే కాకుండా పాటలలోనూ తాను మొనగాడినని జర్నలిస్టు కేపీ నిరూపించారని మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు అన్నారు. కెపీ, శ్యామల దంపతుల జన్మదినోత్సవానికి హాజరైన ఆయన వారిని శాలువాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సినిమా పాటలు మనిషికి ఎంతో ప్రేరణ కలిగిస్తాయని, ఉదయానందాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. అలాంటి పాటలతో కళాకారులు ఎంతో ఆసక్తిగా ముందుకు రావడం సంతోషాన్ని ఇచ్చింది అన్నారు. భవిష్యత్తులోనూ కేపీ ద్వారా ఇలాంటి మంచి కార్యక్రమాలను ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. జ్ఞానానికి కులమతాలతో సంబంధం ఉండదని మాజీ ఎమ్మెల్యే బక్కని అన్నారు. ఆధ్యాత్మిక పాటలు పాడడంలో జర్నలిస్టు కేపీ సిద్ధహస్తులని అన్నారు.

# పదో తరగతి విద్యార్థులకు 7 మార్కులు కలపాలని ఏపీ ఎస్ఎస్సీ బోర్డు నిర్ణయం



ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ ఇటీవల పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు ఊరటనిచ్చేలా అదనపు మార్కుల కేటాయింపుపై కీలక నిర్ణయం తీసుకుంది. ప్రశ్నాపత్రాల్లో దొర్లిన సాంకేతిక పొరపాట్లు, అస్పష్టంగా ఉన్న ప్రశ్నల వల్ల విద్యార్థులు నష్టపోకూడదనే ఉద్దేశంతో ఎస్ఎస్సీ బోర్డు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.

బోర్డు నిపుణుల కమిటీ నివేదిక ప్రకారం, హిందీ సబ్జెక్టులో సందిగ్ధంగా ఉన్న ప్రశ్నల కారణంగా 2 మార్కులు, ఇంగ్లిష్ సబ్జెక్టులో తలెత్తిన లోపాల వల్ల 5 మార్కులు.. మొత్తంగా 7 మార్కులను అదనంగా కలపనున్నారు. ప్రశ్నలు స్పష్టంగా లేని చోట వాటిని అటెంప్ట్ చేసిన విద్యార్థులందరికీ ఈ మార్కులు లభిస్తాయి. ఇది విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెరగడమే కాకుండా, మెరుగైన గ్రేడింగ్ సాధించడానికి దోహదపడనుంది. అయితే, మరో మూడు ప్రశ్నలపై తల్లిదండ్రులు అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ, వాటిలో ఎలాంటి తప్పులు లేవని బోర్డు స్పష్టం చేసింది. ఇప్పటికే డీఈవోలకు, మూల్యాంకనం చేసే ఉపాధ్యాయులకు ఈ అదనపు మార్కుల కేటాయింపుపై బోర్డు స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక






# గానామృతం..

# ఆద్యంతం అత్యద్భుతం..



- నాగులపల్లి కంట్రీసైడ్ రిసార్ట్స్ లో కార్యక్రమం..
- జర్నలిస్ట్ కేపీ దంపతుల కోసం శ్రీ సరస్వతి కళా పీఠం సుమధుర గానలహరి..
- హాజరైన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యేలు బక్కని నరసింహులు, ప్రతాప్ రెడ్డి..
- విశిష్ట అతిథిగా హాజరైన టాలీవుడ్ నిర్మాత బండ్ల గణేష్
- బిజెపి నాయకులు శ్రీవర్ధన్ రెడ్డి, అందె బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి,
- మున్సిపల్ చైర్మన్ బస్వం చైర్మన్ అందె మోహన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్ తదితర నేతల హాజరు
- ఘనంగా కేపీ దంపతుల జన్మదిన ఉత్సవం..
- అద్భుతమైన పాటలతో అలరించిన గాయకులు.. సాంస్కృతిక కార్యక్రమాలతో చిన్నారులు..
- హాజరైన అన్ని పార్టీల నాయకులు..
- కార్యక్రమంలో గబ్బర్ సింగ్ టీం నటుల సందడి



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**

**పాట పరవశింపజేసింది..** పాట ఆహ్లాదాన్ని పంచింది..పాట ఆనందోత్సాహాలలో తేలించింది.. ఒకవైపు గానామృతం.. మరోవైపు సాంస్కృతిక వైభవం.. వెరసి వీక్షకులకు వీనుల విందు చేసింది. షాద్ నగర్ సీనియర్ జర్నలిస్ట్ కేపీ,శ్యామల దంపతుల జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీ సరస్వతి కళా పీఠం ఆధ్వర్యంలో నాగులపల్లి లోని కంట్రీ సైడ్ రిసార్ట్స్ లో ఆదివారం సాయంత్రం అద్భుతమైన కార్యక్రమం శ్రీకారం చుట్టుకుంది. కార్యక్రమ నిర్వాహకులు రోజా,వేణుగోపాల్ మధిర ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాలలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గాయనీ, గాయకులు తమ పాటలతో అలరించారు.. కార్యక్రమాన్ని ఆద్యంతం రక్తి కట్టించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్,ప్రముఖ నిర్మాత బండ్ల గణేష్,మాజీ ఎమ్మెల్యేలు బక్కని నరసింహులు, చౌలపల్లి ప్రతాపరెడ్డి, మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వం, వైస్ చైర్మన్ అందె మోహన్ బిజెపి నాయకులు శ్రీవర్ధన్ రెడ్డి,అందె బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్, మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల, శ్రవణ్ రెడ్డి, పి వెంకట్రాంరెడ్డిలతోపాటు వివిధ వార్డుల కౌన్సిలర్లు, అన్ని పార్టీల నాయకులు కార్యక్రమానికి హాజరయ్యారు. హైదరాబాద్, విజయవాడ తదితర ప్రాంతాల నుండి గైని గాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

## పాటల పూతోటలో..

ప్రతి నిమిషం ఆసక్తికరంగా సాగిన ఈ కార్యక్రమంలో గాయనీ గాయకులు ఎన్నో మధుర గీతాలతో అలరించారు.తన ఈల పాటలో రికార్డు సృష్టించిన రోజా మధిర ఈలపాటతో కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం హిమగిరి సొగసులు.. మురిపించను మనసులు..అన్న ఘంటసాల, సుశీల గీతంతో హనుమంతరావు, రత్నకుమారి కార్యక్రమం ప్రారంభించారు. ఆ తర్వాత ఎన్నెన్నో మధురమైన గీతాలు కార్యక్రమంలో అలరించాయి. అదేవిధంగా జర్నలిస్టు ఎండి ఖాజాపాషా కేపి కూడా పలు సినీ పాటలను ప్రముఖుల ముందు పాడి అలరించారు. మధురమైన పాత గీతాలతో పాటు కొత్త గీతాలను కూడా ఆలపించడం కార్యక్రమానికి వన్నెను తీసుకొచ్చింది. కొన్ని పాటలకు అభిమానులు వేదిక పైకి వచ్చి నృత్యాలు చేయడం విశేషం. జర్నలిస్ట్ కేపీ పాడిన ఖల్ నాయక్ పాటకు గబ్బర్ సింగ్ టీం వేదిక పైకి వచ్చింది నృత్యాలు చేశారు. జర్నలిస్టు కేపీతో కలిసి చిన్నారి అక్షర పాడిన వెన్నెలైనా చీకటైనా పాటకు వేదికపైనే ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి పాట మొత్తం ఎంతో శ్రద్ధగా విన్నారు. చిన్నారిని ప్రత్యేకంగా వారు అభినందించారు.

## పాటలతో ఇరగదీసిన గైని గాయకులు

షాద్ నగర్ పట్టణంలో రిసార్టులో జరిగిన గానాలహరి కార్యక్రమానికి శ్రీ సరస్వతి కళా పీఠం కు చెందిన గాయని గాయకులు హాజరై మంచి పాటలతో శ్రోతలను ఉర్రూతలూగించారు. ఈలోపాటలతో రోజా మధిర స్వరానికి అందరూ మెచ్చుకున్నారు. ఈలతో పాటల సృష్టించడం ఎంతో గొప్ప కళాని ఎమ్మెల్యే శంకర్ తదితరులు కొనియాడారు. అదేవిధంగా హనుమంతరావు, విష్ణు ప్రియ,ప్రజ్ఞ, ఉదయ భాస్కర్, నిషిజ,రమణి హరి,సుదర్శన్, క్రాంతి,సీనియర్ సింగర్ వెంకటరత్నం, రమాదేవి, జర్నలిస్ట్ కేపీ, చిన్నారి అక్షర, న్యాయవాది మహేందర్ రెడ్డి తదితరులు తమ పాటలతో శ్రోతలను ఆకట్టుకున్నారు.

## కేపీ ది గ్రేట్..

ఒకవైపు జర్నలిస్టుగా,జూ మరోవైపు సేవకుడిగా, ఇంకోవైపు కళాకారుడిగా బహుముఖ ప్రజ్ఞాన చాటుతూ జర్నలిస్ట్ ఖాజా అన్నింటా గ్రేట్ అనిపించుకుంటున్నారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేష్,మాజీ ఎమ్మెల్యేలు ఒక్కని నరసింహులు, ప్రతాపరెడ్డి, బిజెపి నాయకులు అంతే బాబయ్య,నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి, పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్,వైస్ చైర్మన్ అందేమోహన్ ఇతర నాయకులు కొనియాడడం విశేషం. ఇలాంటి మంచి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టు ఎప్పటికప్పుడు జనాలను అలరిస్తున్న కెపి కుటుంబం సకల సంతోషాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు. కెపి,శ్యామల దంపతులను ఘనంగా శాలువాలతో సత్కరించారు. అనంతరం తమ పాటలతో అలరించిన గాయని గాయకులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఘనంగా సత్కరించారు. వారి ప్రతిభను ఆయన అభినందించారు.

## అలరించిన అన్ను అండ్ పార్టీ..

ఈ కార్యక్రమంలో భాగంగా కెపి మనవరాలు చిన్నారి అన్ను రఘుకుల తిలకా రారా అంటూ నృత్యం చేసి ఆకట్టుకుంది. అలాగే చిన్నారులు తమ నృత్యాలతో ఆకట్టుకోవడం విశేషం.డాన్స్ మాస్టర్ అన్వర్ ఆధ్వర్యంలో చిన్నారులు ప్రదర్శన ఇచ్చారు. చివరగా జర్నలిస్టులు, కేపీ సన్నిహిత మిత్రుల ఆధ్వర్యంలో కెపి ,శ్యామల దంపతులకు కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా శ్రీ సరస్వతి కళపీఠం ఆధ్వర్యంలో కూడా కేపీ దంపతులను సత్కరించారు. అలాగే పెద్ద ఎత్తున తరలివచ్చిన కేపీ అభిమానులు కూడా ఆయనను ఘనంగా సత్కరించడం విశేషం. నియోజకవర్గ స్థాయిలో జర్నలిస్టులు పాల్గొన్నారు.
















# గాయపడ్డ సింహం.. ఓ మంచి పాత్రలో కనిపిస్తా

## నటుడు జెడి చక్రవర్తి



కమల్ హాసన్ చేసినన్ని పాత్రలు సినీ చరిత్రలోనే ఎవరూ చేసి ఉండరని నటుడు జేడీ చక్రవర్తి అన్నారు. తరుణ్ భాస్కర్ ప్రధాన పాత్రలో కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గాయపడ్డ సింహం' మే 1న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమాలో జేడీ చక్రవర్తి కీలకపాత్రలో నటించారు. ఈ సినిమా ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ తన పాత్ర గురించి చెప్పారు. 'నటులందరికీ కమల్ హాసన్ నటనే ఒక బెంచ్‌మార్క్. ఆయన చేసినన్ని పాత్రలు ప్రపంచ సినీ చరిత్రలో ఎవరూ ఇప్పటివరకూ చేయలేదు. ఇకపై కూడా ఆయన్ని బీట్ చేయడం కష్టమే. ఒక నటుడిగా నేను ఆయనకు ఏ విషయంలోనూ సరితూగను. ఆయనకు రాని అదృష్టం నాకు ఈ సినిమా రూపంలో దక్కింది. ఇందులో నాది అంత గొప్ప పాత్ర. చాలా వేరియేషన్స్ ఉంటాయి. ఇప్పటివరకూ కమల్ హాసన్ కూడా చేయని పాత్ర ఇది. కెరీర్‌లో చాలామందికి జయాపజయాలు ఉండొచ్చు. కానీ, ప్రతిఒక్కరికీ కెరీర్‌లో గుర్తుండిపోయే పాత్ర ఒకటి ఉంటుంది. నాకు 'మనీ', 'అనగనగా ఒక రోజు' చిత్రాలు ఎప్పటికీ ప్రత్యేకమే. మళ్లీ చాలా ఏళ్ల తర్వాత ఆ సినిమాల్లో పోషించిన లాంటి పాత్ర వచ్చింది' అని జేడీ చక్రవర్తి చెప్పారు. 'గాయపడ్డ సింహం'లో ఎంతోమంది దర్శకులు నటించారని ఇది దర్శకుల చిత్రమని ఆయన అన్నారు.

# వారాణాసిలో మరో బాలీవుడ్ నటి ?

మహేష్ బాబు హీరోగా రూ. 1300 కోట్ల భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న అడ్వెంచర్ ఎపిక్ 'వారణాసి'. ఈ చిత్రాన్ని రాజమౌళి అత్యంత ప్రతిష్టాత్మకంగా ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో చిత్రీకరిస్తున్నారు. ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్న ఈ సినిమాలో పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్‌గా నటిస్తుండగా, ఆర్. మాధవన్ కూడా ఒక కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ఇక ఈ మూవీ పై రోజుకో ఆసక్తికర వార్త బయటకు వస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని రామోజీ ఫిలిం సిటీలో వేసిన భారీ వారణాసి సెట్‌లో మహేష్ బాబు (రుద్ర), ప్రియాంక చోప్రా (మందాకిని)లపై కీలక సన్నివేశాలను రాజమౌళి చిత్రీకరిస్తున్నారు. ఈ షెడ్యూల్ ముగియగానే ఒక గ్రాండ్ సాంగ్ షూటింగ్ జరగనుందని, అందులో మహేష్ బాబు సరసన నటించేందుకు మరో బాలీవుడ్ స్టార్ హీరోయిన్‌ను చిత్రబృందం సంప్రదించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ప్రియాంక చోప్రా తన పాత్ర కోసం ఒక అదిరిపోయే డ్యాన్స్ నెంబర్ ఉండాలని కోరగా, ఈ స్పెషల్ సాంగ్ సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని సమాచారం. ఇక హాలీవుడ్ స్థాయి విజువల్స్ కోసం అంటార్కిటికా వంటి లొకేషన్లలో కూడా షూటింగ్ జరిపిన జక్కన్న, ఈ స్పెషల్ సాంగ్‌ను విజువల్ వండర్‌గా తీర్చిదిద్దబోతున్నారట. ఏప్రిల్ 7, 2027న ఉగాది కానుకగా విడుదల కాబోతున్న ఈ చిత్రం, భారతీయ సినిమా చరిత్రలో సరికొత్త రికార్డులను సృష్టించడం ఖాయమని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.





# 15 ఏళ్లకే ఆ నరకం చూశాను

## : డీప్‌ఫేక్ ఫొటోలపై జాన్వీ కపూర్

టాలీవుడ్, బాలీవుడ్‌లో వరుస ప్రాజెక్టులతో దూసుకుపోతున్న నటి జాన్వీ కపూర్, తన టీనేజ్ రోజుల్లో ఎదురైన ఒక చేదు అనుభవాన్ని పంచుకుంది. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన జాన్వీ, టెక్నాలజీ దుర్వినియోగం వల్ల తాను ఎదుర్కొన్న మానసిక వేదనను బయటపెట్టింది.

స్కూల్ రోజుల్లో జాన్వీకి కేవలం 15 ఏళ్లు ఉన్నప్పుడు, ఆమె ఫొటోను సాంకేతికతతో అసభ్యకరంగా మార్చి ఒక అశ్లీల వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. తన స్నేహితురాలు ఆ ఫొటోను చూపించే వరకు తనకు విషయం తెలియదని, అది చూసి ఏం చేయాలో పాలుపోక ఎంతో ఏడ్చానని ఆమె ఎమోషనల్ అయింది. సోషల్ మీడియాలో నైతికత ఉండదని ఆ చిన్న వయసులోనే తనకు అర్థమైందని, భవిష్యత్తులో ఇలాంటివి ఎదుర్కోవడానికి అప్పుడే మానసిక ధైర్యాన్ని పెంచుకున్నానని తెలిపింది.

ఇప్పుడు తనపై వచ్చే నెగటివ్ కామెంట్లను లేదా మార్ఫింగ్ ఫోటోలను పెద్దగా పట్టించుకోనని జాన్వీ స్పష్టం చేసింది. టెక్నాలజీ పెరుగుతున్న కొద్దీ ఇలాంటి సవాళ్లు తప్పవని, వాటిని ధైర్యంగా ఎదుర్కోవడమే మార్గమని ఆమె యువతకు సూచించింది. కెరీర్ విషయానికి వస్తే... 'దేవర' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన జాన్వీ, ప్రస్తుతం రామ్ చరణ్ సరసన 'పెద్ది' సినిమాలో నటిస్తోంది. వీటితో పాటు మరికొన్ని క్రేజీ ప్రాజెక్టులతో ఆమె బిజీగా ఉంది.







# రాకాసకు మంచి ఓపెనింగ్స్

మెగా డాటర్ నిహారిక కొణిదెల నిర్మాతగా వరుస విజయాలతో దూసుకుపోతున్నారు. తాజాగా ఆమె నిర్మించిన 'రాకాస' సినిమా విడుదలైన తొలి రోజునుంచే సూపర్ హిట్ టాక్ తెచ్చుకుని బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధిస్తోంది. 'రాకాస' చిత్రాన్ని ఓటీటీ సిరీస్‌లతో గుర్తింపు తెచ్చుకున్న మానస శర్మ తెరకెక్కించారు. ఈ సినిమాలో సంగీత్ శోభన్ హీరోగా నటించగా, నయన్ సారిక హీరోయిన్‌గా మెప్పించారు. హారర్, కామెడీ, ఫాంటసీ మేళవింపుతో రూపొందిన ఈ చిత్రంలో వెన్నెల కిషోర్, బ్రహ్మాజీ, గెటప్ శ్రీను, తనికెళ్ల భరణి, ఆశిష్ విద్యార్థి కీలక పాత్రల్లో నటించారు. ఏప్రిల్ 3న గ్రాండ్‌గా విడుదలైన 'రాకాస' సినిమా, గ్లింప్స్, టీజర్, ట్రైలర్‌తో ముందుగానే మంచి అంచనాలు ఏర్పరచుకుంది. విడుదలైన తర్వాత ఆ అంచనాలను మించి ప్రేక్షకులను అలరించడంతో తెలుగు రాష్టాల్లోనే కాకుండా ఓవర్సీస్‌లో కూడా మంచి రెస్పాన్స్ వస్తోంది.ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, 'రాకాస' సినిమా కేవలం రెండు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.10.30 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ సాధించింది. శుక్ర, శనివారాల్లో వచ్చిన రెస్పాన్స్ ఆదివారం మరింత పెరగడంతో వసూళ్లు వేగంగా పెరుగుతున్నాయి. ఈ సినిమాపై ఉన్న క్రేజ్‌కు నిదర్శనంగా, విడుదలైన తొలి 24 గంటల్లోనే 60 వేలకుపైగా టికెట్స్ అమ్ముడవడం విశేషం. డిఫరెంట్ ప్రమోషనల్ స్టాటజ్రీ కూడా సినిమాకు ప్లస్ అయిందని ట్రేడ్ సర్కిల్స్ అభిప్రాయపడుతున్నాయి.ఇప్పటికే నిర్మాతగా 'కమిటీ కుర్రోళ్లు' సినిమాతో బ్లాక్‌బస్టర్ అందుకున్న నిహారిక, 'రాకాస'తో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నట్లు కనిపిస్తోంది. జీ స్టూడియోస్ సమర్పణలో ఉమేష్ కుమార్ బన్సాల్‌తో కలిసి ఈ చిత్రాన్ని నిర్మించిన తీరు ప్రశంసలు అందుకుంటోంది. సంగీత్ శోభన్ కామెడీ టైమింగ్, నయన్ సారిక గ్లామర్, సపోర్టింగ్ క్యాస్ట్ ఎంటర్‌టైన్‌మెంట్ అన్నీ కలిసి సినిమాకు మంచి ప్లస్ అయ్యాయి. ముఖ్యంగా హారర్ కామెడీ జానర్‌ను కొత్తగా ప్రెజెంట్ చేయడంపై ప్రేక్షకులు ప్రశంసలు కురిపిస్తున్నారు. 'రాకాస' సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి జోరు చూపిస్తూ, నిహారిక కొణిదెలను విజయవంతమైన నిర్మాతగా మరోసారి నిలబెడుతోంది.

# అనిల్ రావిపూడికి దిల్ రాజు బంపర్ ఆఫర్!


తన తదుపరి మల్టీస్టారర్ సినిమా హీరోయిన్ ఎంపికపై వస్తున్న ఊహాగానాలకు ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి తెరదించారు. విక్టరీ వెంకటేశ్, నందమూరి కల్యాణ్‌రామ్ హీరోలుగా తాను తెరకెక్కిస్తున్న చిత్రంలో కృతిశెట్టిని ఓ కథానాయికగా తీసుకున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ ప్రకటనతో కొన్ని రోజులుగా మీడియాలో వస్తున్న కథనాలకు స్పష్టత లభించినట్లయింది.

ప్రదీప్ రంగనాథన్, కృతిశెట్టి జంటగా విఘ్నేశ్ శివన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన నిర్మాత దిల్ రాజు, దర్శకుడు అనిల్ రావిపూడి పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా దిల్ రాజు మాట్లాడుతూ, అనిల్ రావిపూడిలో మంచి నటుడు ఉన్నాడని, అవకాశం వస్తే తానే హీరోగా పరిచయం చేస్తానని అన్నారు.దిల్ రాజు ఆఫర్‌పై అనిల్ రావిపూడి స్పందిస్తూ.. "దిల్ రాజు గారి ఆఫర్ బాగుంది. కానీ, ఇప్పట్లో నటించే ఆలోచన లేదు. ఆయన నిర్మాతగా ప్రదీప్ హీరోగా సినిమా తీస్తే నేను డైరెక్ట్ చేస్తాను" అని చమత్కరించారు. ఇదే వేదికపై తన కొత్త సినిమా హీరోయిన్‌పై స్పష్టత ఇచ్చారు. "మా సినిమాలో కృతిశెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ విషయంపై ఇప్పటికే చాలా రూమర్లు వచ్చాయి. వాటన్నింటికీ ఇప్పుడు చెక్ పెడుతున్నా" అని తెలిపారు.'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' హీరో ప్రదీప్ రంగనాథన్‌ను అనిల్ రావిపూడి ప్రశంసించారు. ప్రదీప్ హీరోలా కాకుండా మనలో ఒకడిలా ఉంటాడని, అందుకే ప్రేక్షకులు ఆయనను అంతగా ఆదరిస్తున్నారని కొనియాడారు. కాగా, 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' చిత్రం ఏప్రిల్ 10న తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది.





# పెద్ది డిజిటల్ హక్కుల కోసం నెట్‌ఫ్లిక్స్ పోటీ



రిలీజ్‌కు ముందే టాలీవుడ్‌లో సంచలనాలు సృష్టిస్తుంది. రూరల్ స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమాపై మొదటి నుంచే భారీ అంచనాలు ఉన్నాయి. తాజాగా ఈ అంచనాలను మరింత పెంచేలా ఓటీటీ హక్కుల విషయంలో భారీ డీల్ కుదిరినట్లు సమాచారం. ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ 'పెద్ది' డిజిటల్ స్ట్రీమింగ్ హక్కుల కోసం ఏకంగా రూ.130 కోట్ల ఆఫర్ ఇచ్చినట్లు టాలీవుడ్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. తెలుగుతో పాటు ఇతర భాషల హక్కులు కలిపి ఈ డీల్ కుదిరిందని చెబుతున్నారు. ఒక తెలుగు సినిమా కేవలం ఓటీటీ రైట్స్ ద్వారానే ఇంత భారీ మొత్తాన్ని రాబట్టడం ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది.ఇంకా ఆసక్తికర విషయం ఏమిటంటే, సినిమా థియేటర్లలో సాధించే విజయాన్ని బట్టి అదనంగా రూ.20 కోట్ల బోనస్ ఇవ్వాలని కూడా నెట్‌ఫ్లిక్స్ ప్రతిపాదించిందట. అంటే 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌గా నిలిస్తే, మొత్తం డిజిటల్ డీల్ విలువ రూ.150 కోట్లకు చేరుకునే అవకాశం ఉంది. ఇది రామ్ చరణ్‌కు ఉన్న గ్లోబల్ మార్కెట్ క్రేజ్‌ను మరోసారి నిరూపిస్తోందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సంగీతాన్ని ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ అందిస్తున్నారు. ఈ కాంబినేషన్ సినిమాపై అంచనాలను మరింతగా పెంచింది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ ప్రేక్షకులను ఆకట్టుకుని, సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ పీరియడ్ స్పోర్ట్స్ డ్రామాలో రామ్ చరణ్ 'పెద్ది పహిల్వాన్'గా, అలాగే క్రికెటర్‌గా రెండు భిన్నమైన షేడ్స్‌లో కనిపించబోతున్నాడు. నటన, బాడీ లాంగ్వేజ్ పరంగా ఇది ఆయన కెరీర్‌లో మరో కొత్త ఛాలెంజ్‌గా భావిస్తున్నారు అభిమానులు. ఈ చిత్రం ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుండగా, థియేటర్లలో విడుదలైన నాలుగు వారాల తర్వాత ఓటీటీలో స్ట్రీమింగ్‌కు వచ్చే అవకాశం ఉంది.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701643